


# ప్రజాప్రశ్న
తెలుగు దినపత్రిక




సంపుటి: 4 సంచిక: 20, పేజీలు - 08
మంగళవారం, మే 14, 2024 వెల: 5 రూ/.
Published from Hyderabad, Nalgonda, Karimnagar, Warangal, Khammam, Vijayawada, Vishakhapatnam,Tirupati

## 38 కేసులు, స్ట్రాంగ్ రూంలకు ఈవీఎంలు

**- ఓటింగ్ శాతంపై నేటికి స్పష్టత**



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** తెలంగాణ రాష్ట్రంలో ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయని రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి వికాస్ రాజ్ తెలిపారు. ఎన్నికలు ముగిసిన అనంతరం సోమవారం రాత్రి 7 గంటలకు ఆయన మీడియాతో మాట్లాడారు. ఎన్నికలకు ప్రజల నుంచి మంచి స్పందన లభించినట్లుగా తెలిపారు. రాష్ట్రంలో పోలింగ్శాతం బాగానే నమోదైందని పేర్కొన్నారు. తుది ఓటింగ్ శాతం ఎంత అనేది మంగళవారం వెల్లడిస్తామని వికాస్ రాజ్ తెలిపారు. సోమవారం వివిధ కారణాలపై 38 కేసులు నమోదు చేశామని ఆయన వెల్లడించారు. జీపీఎస్ఉన్న వాహనాల్లో ఈవీఎంలు తరలిస్తామన్నారు. తెలంగాణలో సాయంత్రం 5 గంటల వరకు 61.16 శాతం పోలింగ్ నమోదైందని తెలిపారు. అత్యధికంగా మెదక్‌లో 71.33 శాతం పోలింగ్ నమోదు కాగా, అత్యల్పంగా హైదరాబాద్‌లో 39.17 శాతం పోలింగ్ నమోదైందని వెల్లడించారు. కేంద్రం ఆధ్వర్యంలో ఉండే యాప్ లలో 415 ఫిర్యాదులు రాగా, వేర్వేరు ప్రాంతాల్లో సోమవారం 38 ఎఫ్ఐఆర్ లు నమోదయ్యాయని వికాస్ రాజ్ తెలిపారు. 225 ఫిర్యాదులు సీవిజిల్ యాప్ ద్వారా వచ్చాయన్నారు. వికాస్ రాజ్ ఇంకా మాట్లాడుతూ.. 'రాష్ట్రంలో ఓటర్ల నుంచి మంచి స్పందన వచ్చింది. గత ఐదారు నెలలుగా సిబ్బంది ఎన్నికల ప్రక్రియను నిర్వహించి తమ బాధ్యతల్ని విజయవంతంగా పూర్తి చేశారు. భారీ బందోబస్తుతో ఈవీఎంలను స్ట్రాంగ్ రూమ్ లకు

6లో

## రాష్ట్రంలో పోలింగ్ శాతం పెరిగింది

**- రీపోలింగ్ ఫిర్యాదులేవీ రాలేదని స్పష్టీకరణ**




**అమరావతి (ప్రశ్న న్యూస్)** ఏపీలో జరిగిన సార్వత్రిక ఎన్నికలపై రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి ముఖేశ్ కుమార్ మీనా మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పోలింగ్ కేంద్రాల్లోసోమవారం ఉదయం నుంచే ఓటర్లు బారులు తీరారని వెల్లడించారు. ఈసారి ఎన్నికల్లో పోలింగ్ శాతం పెరిగిందని, ఓటర్లు పెద్ద ఎత్తున తరలి వచ్చి ఓటేశారని మీనా వెల్లడించారు. గుర్తింపు కార్డు లేకుండా పోలింగ్ కేంద్రాలకు వచ్చిన వారి సంఖ్య ఈసారి తక్కువేనని అన్నారు. సాయంత్రం 5 గంటల వరకు 68 శాతం పోలింగ్ నమోదైందని తెలిపారు. మరిన్ని అంశాలు పరిశీలించిన తర్వాత తుది పోలింగ్ వివరాలు వెల్లడిస్తామని చెప్పారు. రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో సాయంత్రం 6 గంటల సమయానికి క్యూలో ఉన్న వారికి ఓటు వేసే అవకాశం కల్పిస్తున్నామని తెలిపారు. ఒకవేళ క్యూలైన్లో 300 మంది వరకు ఉంటే రాత్రి 10 గంటల వరకు పోలింగ్ జరిగే అవకాశం ఉంటుందని అన్నారు.పోలింగ్ సమయంలో పలుచోట్ల ఈవీఎంలకు సంబంధించి కొన్ని సమస్యలు వచ్చాయని తెలిపారు. 275 బ్యాలెటింగ్ యూనిట్లకు సంబంధించి సమస్యలు వచ్చాయని అన్నారు. 217 కంట్రోల్ యూనిట్లు, 600 వీవీ ప్యాట్లకు సంబంధించి సమస్యలు ఉత్పన్నమయ్యాయని ముఖేశ్ కుమార్ మీనా పేర్కొన్నారు. ముందుజాగ్రత్తగా పోలింగ్ కేంద్రాల వద్ద 20 వేల యంత్రాలను అధికంగా అందుబాటులో ఉంచామని చెప్పారు. ఇక, అనంతపురం, పల్నాడు, అన్నమయ్య జిల్లాల్లో హింసాత్మక సంఘటనలు జరిగే అవకాశం ఉందని ముందే సమాచారం ఉందని మీనా తెలిపారు. అలాంటి చోట్ల తగిన ఏర్పాట్లు చేశామని వెల్లడించారు. పల్నాడు జిల్లాలో 12 ఘటనలపై సమాచారం అందిందని అన్నారు. మాచర్ల, తెనాలి ఘటనలపై

6లో

## బుర్ఖా వివాదంలో మాధవీ లతకు షాక్

**- కేసు నమోదు చేసిన పోలీసులు**



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** హైదరాబాద్ బీజేపీ అభ్యర్థి కొంపెల్ల మాధవీ లతపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఎన్నికల వేళ ఆమె తీరు అభ్యంతరకరంగా ఉండడంతోనే ఈ కేసు పెట్టినట్లుగా పోలీసులు తెలిపారు. ఎన్నికల్లో తప్పిదాలు, దొంగఓట్ల గురించి తొలి నుంచి మాధవీలత ఆరోపిస్తున్నారు. ఈ క్రమంలోనే ముస్లిం మహిళలు బురా? ధరించి పోలింగ్ కేంద్రానికి రాగా వారిపై మాధవీలత అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ప్రతి పోలింగ్ బూత్ కు వెళ్లి ఓటింగ్ సరళిని పరిశీలిస్తున్న మాధవీ లత బురా? వేసుకొని ఓటు వేయడానికి వచ్చిన ముస్లిం మహిళలపై కూడా ఓ కన్నేశారు. పోలింగ్ కేంద్రంలో ఉన్న వారి గుర్తింపు కార్డులను తీసుకొని పరిశీలించారు. అలాగే హిజాబ్ తొలగించమని చెప్పి వారి ముఖాన్ని సరిపోల్చుకున్నారు. గుర్తింపు కార్డులో పేర్కొన్న వయసుకు తగ్గట్లే ఆ మహిళలు ఉన్నారా అనేది కూడా పరిశీలించారు. దీనికి సంబంధించిన వీడియోలు ప్రస్తుతం సోషల్

6లో

## ఓటరుపై చేయి చేసుకున్న వైసీపీ ఎమ్మెల్యే

**- ఈసీ ఆగ్రహం, హౌస్ అరెస్టుకు ఆదేశం**



**తెనాలి (ప్రశ్న న్యూస్)** తెనాలి సిట్టింగ్ ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ ప్రస్తుతం టాక్ ఆఫ్ ద సోషల్ మీడియాగా నిలిచారు. ఓటరుపై ఎమ్మెల్యే చేయి చేసుకోవడం.. ఓటరు కూడా అదే రీతిలో ఎమ్మెల్యేను చెంపదెబ్బ కొట్టడం ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. జాతీయ మీడియాలోనూ దీనిపై కథనాలు, వీడియోలు వస్తున్నాయి. ఈ క్రమంలోనే ఎమ్మెల్యేను కొట్టిన ఓటరు సుధాకర్ ఘటనపై స్పందించారు. ఆ సమయంలో ఏం జరిగిందనే విషయాన్ని మీడియాకు వెల్లడించారు. తెనాలి ఎమ్మెల్యే శివకుమార్‌ను కొట్టాలనే ఉద్దేశం తనకు లేదని, అదంత అనుకోకుండా జరిగిందని సుధాకర్ చెప్తున్నారు. "ఎమ్మెల్యే మనుషులు, ఆయన కుటుంబసభ్యులు డైరెక్టుగా పోలింగ్ కేంద్రంలోకి వెళ్లారు. మామూలుగా అందరూ క్యూలైన్లో నిలబడి ఓటేయ్యాలి. అంతే కానీ.. పోలింగ్ బూత్ వద్ద ఎవరికీ స్పెషల్ సౌకర్యాలు ఉండవు. అందరూ క్యూలైన్‌లోనే వెళ్లి ఓటేయాలి. దీంతో క్యూలైన్‌లో వెళ్లి ఓటెయ్యాలని చెప్పా. దీంతో ఆయన బయటకు వచ్చిన తర్వాత నన్ను బూతులు తిట్టారు. మీరెవరు నాకు చెప్పేందుకు అంటూ కోపంతో కొట్టారు. అయితే ఆ సమయంలో ఏం జరిగిందో నాకు తెలియదు. నేనూ ఎమ్మెల్యేను కొట్టినట్లు తర్వాత తెలిసింది. చుట్టుపక్కలవాళ్లు చెప్పారు. ఎమ్మెల్యే అనుచరులు నన్ను తీవ్రంగా కొట్టారు. పోలీసులు వచ్చి కాపాడారు. బయటకు తీసుకెళ్తామంటే ఓటేసిన తర్వాతే వస్తానని చెప్పా. ఓటేసి వస్తున్నా" అని సుధాకర్ చెప్పారు. ఈ ఘటన తర్వాత నాకు,

6లో

## అలాగైతే పాకిస్థాన్ కు గాజులు తొడిగిస్తాం

**- ప్రధాని మోదీ సంచలన వ్యాఖ్యలు**



**న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్)** పాక్ ఆక్రమిత కశ్మీర్‌ని భారత్‌లో కలిపేసుకుంటే పాకిస్థాన్ ఊరుకోదని, ఆ దేశం గాజులు తొడుక్కుని కూర్చోందని ఫరూక్ అబ్దుల్లా ఇటీవల సంచలన వ్యాఖ్యలు చేశారు. అణుబాంబులకో దాడి చేస్తుందని హెచ్చరించారు. ఆ తరవాత కాంగ్రెస్ సీనియర్ నేత మణిశంకర్ అయ్యర్ కూడా పాకిస్తాన్ ఆక్రమిత కాశ్మీర్ పై ఇలాంటి వ్యాఖ్యలే చేశారు. ఈ వివాదంపై ప్రధాని నరేంద్ర మోదీ తీవ్రంగా స్పందించారు. ఒకవేళ పాకిస్థాన్ గాజులు తొడుక్కుని లేకపోతే ఇప్పుడు తొడుగుతామంటూ

6లో

## ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి చారిత్రాత్మక దినం

- ఏపీలో పోలింగ్ సరళి పట్ల చంద్రబాబు సంతోషం
- ఓటర్లకు ధన్యవాదాలు తెలిపిన టీడీపీ అధినేత
- ప్రజల సంకల్పం, ఉత్సాహం స్ఫూర్తిదాయకమని వెల్లడి



**అమరావతి (ప్రశ్న న్యూస్)** ఆంధ్రప్రదేశ్ లోని 175 అసెంబ్లీ నియోజక వర్గాలు, 25 లోక్ సభ నియోజక వర్గాలకు సోమవారం ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు పోలింగ్ జరిగింది. ఆంధ్రప్రదేశ్ లోని అన్ని జిల్లాల్లోని పోలింగ్ కేంద్రాల ముందు ఉదయం నుంచి బారులుతీరిన ఓటర్లు వారి ఓటు హక్కును

6లో

## కేసీఆర్ కేఏ పాల్‌లా మాట్లాడుతున్నారు

**- కేసీఆర్‌పై నాకు సానుభూతి ఉందన్న రేవంత్**



**కొడంగల్ (ప్రశ్న న్యూస్)** తెలంగాణలో లోక్ సభ ఎన్నికల్లో కీలక ఘట్టమైన పోలింగ్ ప్రశాంతంగా కొనసాగుతోంది. ఈ క్రమంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన సొంతూరైన కొడంగల్‌లోని ఉన్నత పాఠశాలలో ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఓటేసిన అనంతరం మీడియాతో మాట్లాడిన రేవంత్ రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. మాజీ సీఎం, బీఆర్ఎస్ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖర్ రావుపై తనకు సానుభూతి ఉందని తెలిపారు. ఆయన మానసిక ఒత్తిడితో, నిరాశతో భావోద్వేగంతో ప్రకటనలు చేస్తున్నారన్నారు. కేసీఆర్ కూడా కేఏ పాల్‌లాగే మాట్లాడుతున్నారంటూ రేవంత్ రెడ్డి ఎద్దేవా చేశారు. మరోవైపు అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి 39.5 శాతం ఓట్లు వచ్చాయని ఈ ఎన్నికల్లో అంతకుమించి ఓట్లు వస్తాయని రేవంత్ రెడ్డి ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ ఎన్నికలు కాంగ్రెస్ ప్రభుత్వ వంద రోజుల పాలనకు రెఫరెండమని మరోసారి చెప్పుకొచ్చారు. బీజేపీ కూడా ఈ ఎన్నికలు మోదీ పాలనకు రెఫరెండం అని చెబుతోందని గుర్తు చేశారు. సెప్టెంబర్ 17, 2025తో నరేంద్ర మోదీకి 75 ఏళ్లు

6లో

## ఇక త్వరగా పెళ్లి చేసుకోక తప్పేలా లేదు

**- రాయబరేలీలో రాహుల్ గాంధీ ఎన్నికల ప్రచారం**
**- పెళ్లిపై కాంగ్రెస్ అగ్రనేతను ప్రశ్నించిన ఓ చిన్నారి**
**- వివాహం చేసుకుంటానని బదులిచ్చిన ఎంపీ**



**రాయబరేలీ (ప్రశ్న న్యూస్)** దేశంలోనే మోస్ట్ ఎలిజిబుల్ బ్యాచిలర్‌లలో ఒకరైన కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ పెళ్లి గురించి ఎప్పుడూ చర్చ జరుగుతూనే ఉంది. పెళ్లి ఎప్పుడు చేసుకుంటారని రాహుల్ గాంధీని ప్రశ్నిస్తూ ఉండటం, దీనికి ఆయన సమాధానం దాటవేయడం షరామామూలే. తాజాగా, రాయ్‌బరేలిలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తోన్న రాహుల్ గాంధీ తన పెళ్లి గురించి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. రాహుల్ గాంధీని ఓ చిన్నారి 'మీరు పెళ్లెప్పుడు చేసుకుంటారు' అని అడిగితే ఆయన నవ్వుతూ బదులిచ్చారు. 'బహుశా ఇదే సరైన సమయం ఏమో, త్వరలోనే వివాహం చేసుకుంటాను" అని కాంగ్రెస్ యువరాజు అన్నారు.

6లో

## ముంబైలో గాలివాన బీభత్సం

**- బిల్‌బోర్డ్ కూలి 8 మృతి, 59 మందికి గాయాలు**

- ముంబైలో ఒక్కసారిగా మారిపోయిన వాతావరణం
- గాలిదుమారంతో భయభ్రాంతులకు గురైన ప్రజలు
- ఈ సీజన్‌లోనే దేశ ఆర్థిక రాజధానిలో మొదటి వర్షం



6లో

## తెలంగాణ ప్రజలు బీజేపీకి ఫేవర్

**- డబుల్ డిజిట్ పక్కా అంటూ కిషన్ రెడ్డి ధీమా**



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** తాము ఆశించిన విధంగానే బీజేపీకి అనుకూలంగా ప్రజలు ఓట్లు వేశారని.. డబుల్ డిజిట్ ఖాయమని ధీమా వ్యక్తం చేశారు తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు, కేంద్రమంత్రి కిషన్ రెడ్డి. తెలంగాణలో లోక్‌సభ ఎన్నికల పోలింగ్ ముగిసిన అనంతరం సోమవారం రాత్రి కిషన్ రెడ్డి మీడియాతో మాట్లాడారు. సీఎం రేవంత్, రాహుల్గాంధీ మాటలను హస్తం పార్టీ

6లో

## బ్యాక్ టూ హైదరాబాద్

**- పంతంగి టోల్ గేట్ వద్ద ట్రాఫిక్ జామ్**



**చౌటుప్పల్ (ప్రశ్న న్యూస్)** ఆంధ్రప్రదేశ్ లో జరిగిన ఎన్నికల్లో ఓటు వేసేందుకు హైదరాబాద్ సహా తెలంగాణ ప్రాంతాల నుంచి సొంతూళ్లకు వెళ్లిన వారు తిరుగు ప్రయాణమయ్యారు. ఏపీలో ఓటింగ్ ముగియడంతో ఓటర్లు తమ వాహనాలలో తెలంగాణకు తిరుగు ప్రయాణం కావడంతో హైదరాబాద్- విజయవాడ జాతీయ రహదారిపై సోమవారం సాయంత్రం నుంచి ఒక్కసారిగా రద్దీ పెరిగింది. ఓటు హక్కు వినియోగించుకుని ఏపీ నుంచి తిరిగివస్తున్న ఓటర్ల వాహనాలతో చౌటుప్పల్ పంతంగి టోల్ ప్లాజా వద్ద భారీగా ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. ఏపీతోపాటు కోదాడ, ఖమ్మం నుంచి అధిక సంఖ్యలో ఓటర్లు

6లో

# ఈవీఎంల ధ్వంసంతో రెండు పోలింగ్ కేంద్రాల్లో నిలిపిపోయిన ఓటింగ్

**అమరావతి** ఏపీలో పోలింగ్ ప్రశాంతంగా జరుగుతుండగా మరికొన్ని చోట్ల ఉద్రిక్తల మధ్య కొనసాగుతున్నాయి. ఉదయం 7 గంటల నుంచి ప్రారంభమైన పోలింగ్) కు ఎన్నికల సంఘం అధికారులు, పోలీసులు గట్టి బందోబస్తు చర్యలు తీసుకున్నారు. అయితే పోలింగ్ ఏజెంట్లపై దాడులు, బెదిరింపులతో ఆ పోలింగ్ కేంద్రాల్లో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి.అన్నమయ్య జిల్లా రైల్వే కోడూరు నియోజకవర్గంలోని దలవాయి పోలింగ్ కేంద్రంలో జనసేన ఏజెంటు రాజారెడ్డిని పోలింగ్ కేంద్రం నుంచి కొందరు కిడ్నాపు చేయడంతో స్థానిక జనసేన నాయకులు కోపోద్రిక్తులయ్యారు. పోలింగ్ కేంద్రంలోని ఈవీఎంల ను ధ్వంసం చేయడంతో అక్కడ పోలింగ్ నిలిచిపోయింది . పల్నాడు జిల్లా మాచర్లలో ఈవీఎం ధ్వంసంతో సిబ్బంది పోలింగ్ నిలిపివేసి బయటకు వెళ్లిపోయారు.

## తెనాలి, మాచర్ల, అనంతపురంలో జరిగిన సంఘటలను తీవ్రంగా పరిగణించిన ఈసీ

- గృహనిర్బంధంతోపాటు కేసులు పెట్టాలని ఆదేశం
- పుంగనూరులో నిందితులను వదిలేసిన ఎస్ఐని సస్పెండ్ చేయాలని ఆదేశం
- సాయంత్రం 4 - 6 గంటల మధ్య ఎట్టువంటి సంఘటనలు జరిగినా చర్యలు తీవ్రంగా ఉంటాయని హెచ్చరిక

**అమరావతి మే 13:** నేడు రాష్ట్రంలో జరుగుతున్న సార్వత్రిక ఎన్నికల సందర్భంగా పలుచోట్ల పలు దుర్ఘటనలు జరగడాన్ని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారం ముఖేష్ కుమార్ మీనా తీవ్రంగా పరిగణించారు. తెనాలి, మాచర్ల, అనంతపురం లో జరిగిన సంఘటలకు బాధ్యులైన వారిని వెంటనే గృహ నిర్బంధం చేయటంతో పాటు కేసులు పెట్టాలని ఆయా జిల్లాల ఎన్నికల, పోలీస్ యంత్రాంగాలను ఆదేశించారు. పుంగనూరులో జరిగిన సంఘటనలో నిందితులను వదిలేసిన ఎస్ఐ ని వెంటనే సస్పెండ్ చేయాలని ఆదేశించారు. సాయంత్రం 4 - 6 గంటల మధ్య ఎట్టువంటి సంఘటనలు జరిగినా అందుకు బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఆయన హెచ్చరించారు.

# ఓటు హక్కును వినియోగించుకున్న జువ్వాడి నర్సింగరావు



**కోరుట్ల** కోరుట్ల నియోజకవర్గంలో సోమవారం జరిగిన నిజామాబాద్ పార్లమెంట్ ఎన్నికల్లో భాగంగా కోరుట్ల పట్టణంలో కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జీ జువ్వాడి నర్సింగరావు పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా 143 వ పోలింగ్ బూతులో తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు.ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకొని ప్రజాస్వామ్య విలువలను కాపాడాలని అన్నారు.ఈ సందర్భంగా పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తిరుమల గంగాధర్ తో కలిసి ఓటింగ్ సరళిని పరిశీలించారు.. వారి వెంట మ్యాకల నర్సయ్య, కస్తూరి రమేష్, ఓలెపు రాజేష్, బెల్లలా రాజారెడ్డి, కోట గంగాధర్, పెండెం రమేష్, గంగధారి, రమేష్ తదితరులు ఉన్నారు.

# మే 15న శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామి

## - ఆలయంలో కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం

**తిరుపతి :** నారాయణవనం శ్రీ పద్మావతి సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో మే 15న ఉదయం 6.30 గంటల నుండి మధ్యాహ్నం 1 గంట వరకు కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం నిర్వహించనున్నారు. మే 21 నుండి 29వ తేదీ వరకు వార్షిక బ్రహ్మోత్సవాలు జరగనున్నాయి. బ్రహ్మోత్సవాలకు ముందు కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం నిర్వహించడం ఆనవాయితీ.ఇందులో ఆలయ ప్రాంగణం, గోడలు, పైకప్పు, పూజాసామగ్రి తదితర అన్ని వస్తువులను నీటితో శుద్ధి చేస్తారు. అనంతరం నామకోపు, శ్రీచూర్ణం, కస్తూరి పసుపు, పచ్చాకు, గడ్డ కర్పూరం, గంధం పొడి, కుంకుమ, కిచీలీగడ్డ తదితర సుగంధ ద్రవ్యాలు కలగలిపిన పవిత్రజలాన్ని ఆలయం అంతటా ప్రోక్షణం చేశారు. అనంతరం మధ్యాహ్నం 1.30 గంటలకు భక్తులను దర్శనానికి అనుమతిస్తారు.

# మే 22న తిరుమలలో మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ 294వ జయంతి ఉత్సవాలు

**తిరుమల :** తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామికి అపర భక్తురాలు, భక్తకవయిత్రి మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ 294వ జయంతి ఉత్సవాలు మే 22వ తేదీన తిరుమలలో వైభవంగా జరగనున్నాయి. వెంగమాంబ స్వస్థలమైన తరిగొండ, తిరుమల, తిరుపతి దివ్యక్షేత్రాలలో జయంతి ఉత్సవాలను వైభవంగా నిర్వహించనున్నారు. మే 22వ తేదీన సాయంత్రం 4.30 గంటలకు తిరుమలలోని వెంగమాంబ బృందావనంలో పుష్పాంజలి సమర్పిస్తారు. సాయంత్రం 5.30 గంటలకు తిరుమలలోని నారాయణగిరి ఉద్యానంలోని శ్రీ పద్మావతి వేంకటేశ్వర పరిణయోత్సవ మండపానికి ఉభయనాంచారీ సమేతంగా శ్రీవారు పురవీధుల గుండా వేంచేపు చేస్తారు. సాయంత్రం 6 నుండి 7 గంటల వరకు అన్నమాచార్య ప్రాజెక్టు కళాకారులు తరిగొండ వెంగమాంబ సంకీర్తనల గోష్ఠిగానం నిర్వహిస్తారు. రాత్రి 7 గంటలకు విశాఖ శారదా పీఠాధిపతి శ్రీశ్రీశ్రీ స్వరూపానంద స్వామిజీ అనుగ్రహభాషణం చేయనున్నారు.

# గంట గంటకు పెరుగిన పోలింగ్

**విజయవాడ :** ఏపీ, తెలంగాణల్లో పోలింగ్ శాతం గంటగంటకు పెరుగు పోయింది. ఓటర్లు పోలింగ్ కేంద్రాలకు పోటెత్తుతున్నారు. మండుటెండను సైతం లెక్క చేయకుండా ఓటు వేసేందుకు ఆసక్తిచూపుతున్నారు. కొన్ని ప్రాంతాల్లో పోలింగ్ ఆలస్యంగా ప్రారంభమైనా తిరిగి పోలింగ్ శాతం పుంజుకుంది. చెదురుమొదలు ఘటనలు మినహా మిగిలిన ప్రాంతాల్లో పోలింగ్ సాధారణంగా జరుగుతోంది. ముఖ్యంగా మహిళా ఓటర్లు, యువత, కొత్తగా ఓటు హక్కువచ్చిన వారు ఉదయం నుంచే పోలింగ్ కేంద్రాలకు బారులుదీరారు. ఏపీలో మధ్యాహ్నం 1 గంట వరకు 40.26 శాతం పోలింగ్ నమోదైనట్లు ఈసీ తెలిపారు. అలాగే తెలంగాణలో కూడా మధ్యాహ్నం 1 గంట వరకు 40.28శాతం పోలింగ్ నమోదైనట్లు వెల్లడించారు ఎన్నికల అధికారులు. పలు ప్రాంతాల్లో వర్షం కారణంగా పోలింగ్ మందకొడిగా సాగుతోంది. ప్రధాన పార్టీల మధ్య చిన్న చిన్న సంఘటనలు మినహా మరెక్కడా ఎలాంటి అవాంఛనీయమైన ఘటనలు తలెత్తలేదంటున్నారు అధికారులు.

పురుషులకంటే కూడా మహిళా ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు పెద్ద ఎత్తున తరలి వస్తున్నారు.కడపలో 45.86 శాతం, చిత్తూరులో 44.55శాతం బాపట్లలో 44.28 శాతం అల్లూరిలో 32.78 శాతం అనకాపల్లిలో 37.92 శాతం అనంతపురంలో 39.74 శాతం అన్నమయ్యలో 39.47 శాతం కృష్ణాలో 45.02 శాతం కోనసీమలో 44.02 శాతం నంద్యాలలో 26.58 శాతం విశాఖలో 33.69 శాతం ఏలూరులో 38.96 శాతం ప.గో.లో 39.60 శాతం నెల్లూరులో 42.28 శాతం కర్నూలులో 37.70 శాతం ప్రకాశంజిల్లాలో 42.67 శాతం ఎన్టీఆర్ జిల్లాలో 39.73 శాతం విజయనగరంలో 38.46 శాతం తూ.గో.లో 21.79 శాతం పల్నాడులో 40.48 శాతం శ్రీకాకుళంలో 40.73 శాతం తిరుపతిలో 39.10 శాతం గుంటూరులో 40.03 శాతం కాకినాడలో 38.24 శాతం సత్యసాయి జిల్లాలో 38.12 శాతం మన్యంజిల్లాలో 35.01 శాతం

**తెలంగాణలో ఉదయం 1 గంటల వరకు 40.28 శాతం పోలింగ్ నమోదు..**

అదిలాబాద్ -50.18 భువనగిరి -46.49 చేవెళ్ల 34.56 హైద్రాబాద్ -19.37 కరీంనగర్-45.11 ఖమ్మం-50.63
మహబూబాబాద్-48.81 మహబూబ్నగర్-45.84 మల్కాజిగిరి-27.69 మెదక్-46.72 నాగర్ కర్నూల్ -45.88
నల్గొండ-48.48 నిజామాబాద్-45.67 పెద్దపల్లి-44.87 సికింద్రబాద్-24.91 వరంగల్-41.23 జహీరాబాద్-50.71

# ప్రశాంతమైన వాతావరణంలో పోలింగ్ నిర్వహణ

## - రామగుండం పోలీస్ కమిషనర్ ఎం. శ్రీనివాస్ - కమిషనరేట్ పరిధిలోని పోలింగ్ కేంద్రాలను సందర్శించిన సీపీ



**పెద్దపల్లి** రామగుండం పోలీస్ కమిషనరేట్ పెద్దపల్లి జిల్లా మంథని నియోజకవర్గం లోని మంథని ప్రభుత్వ జూనియర్ కళాశాల, రామగుండం నియోజకవర్గం గోదావరిఖని లోని సింగరేణి ట్రైనింగ్ సెంటర్, పెద్దపల్లి నియోజకవర్గం పరిధిలోని పెద్దపల్లి లోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాన్ని, మంచిర్యాల జిల్లాలోని చెన్నూర్ నియోజకవర్గం లోని మావోయిస్టు ప్రభావిత ప్రాంతం కోటపల్లి పోలీస్ స్టేషన్ పరిధి పంగిడి సోమారం లోని స్కూల్, చెన్నూర్ లోని ప్రభుత్వ స్కూల్, బెల్లంపల్లి నియోజకవర్గంలోని బెల్లంపల్లిలోని బజారు ఏరియా లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను, రామన్ పల్లి వద్ద ఉన్న అంతరాష్ట్ర సరిహద్దు చెక్ పోస్ట్ ను పోలీస్ అధికారులతో కలిసి సందర్శించి, విధి నిర్వహణలో ఉన్న అక్కడి పోలీస్ అధికారులకు, సిబ్బందికి ఎన్నికల నిర్వహణ, పోలింగ్ తరువాత పోలింగ్ పరికరాలను కౌంటింగ్ కేంద్రాలకు తరలింపు గురించి పలు ఆదేశాలు సూచనలు చేశారు. ఈసందర్భంగా సీపీ శ్రీనివాస్ మాట్లాడుతూ రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలో పోలింగ్ అనేది ప్రశాంతమైన వాతావరణంలో జరుగుతున్నాయన్నారు. ఎన్నికలు ప్రశాంతమైన వాతావరణంలో నిర్వహించేందుకు ఎలాంటి అవాంఛనియా సంఘటనలు, గోడవలు జరగకుండా పటిష్టమైన భద్రత ఏర్పాట్లు చేయడం జరిగిందన్నారు. ప్రజలు అందరు పోలీస్ వారి సూచనలు పాటిస్తూ పోలీస్ వారికీ సహకరించడం జరుగుతుందన్నారు. ప్రజలు అందరు వచ్చి తమ ఓటు హక్కును స్వేచ్ఛాయుతంగా వినియోగించుకోవాలి పోలీస్ సిబ్బంది వారికి భద్రత కల్పిస్తూ, పోలింగ్ కేంద్రాల వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు చర్యలు చేపట్టడం జరిగిందని సీపీ తెలిపారు. మావోయిస్టు ప్రభావిత ప్రాంతాలలో ప్రాణహిత పరివాహక ప్రాంతంలో, ఫెర్రి పాయింట్స్ వద్ద, పోలింగ్ బూత్ ప్రాంతాలలో డ్రోన్ కెమెరా తో నిరంతర పర్యవేక్షణ, నిఘా కొనసాగుతుందని, స్పెషల్ పార్టీ, గ్రేహౌండ్స్ పార్టీ లతో ఏరియా డామినేషన్, కూబింగ్ లు నిర్వహించడం జరుగుతుందని సీపీ తెలిపారు.

సిపి వెంట స్పెషల్ బ్రాంచ్ ఏసీపీ రాఘవేంద్ర రావు గోదావరిఖని ఏసీపీ రమేష్ , జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్లు, బెల్లంపల్లి ఏసీపీ రవి కుమార్, మంచిర్యాల ఏసీపీ ప్రకాష్, టాస్క్ ఫోర్స్ ఏసీపీ మల్లారెడ్డి, గోదావరిఖని 1 టౌన్ ఇన్స్పెక్టర్ ఇంద్ర సేన్, మంథని సీఐ వెంకటేశ్వర్లు, పెద్దపల్లి సీఐ కృష్ణ, చెన్నూర్ రూరల్ సీఐ సుధాకర్, చెన్నూర్ టౌన్ సీఐ రవీందర్, బెల్లంపల్లి టౌన్ ఇన్స్పెక్టర్ దేవయ్య, రూరల్ సీఐ ఆఫ్జాలొద్దీన్ ,ఎస్ఐ లు పాల్గొన్నారు.

# ఓటు హక్కును వినియోగించుకున్న కలెక్టర్



**ఒంగోలు** కలెక్టర్ మరియు జిల్లా ఎన్నికల అధికారి .ఏ. ఎస్.దినేష్ కుమార్ తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. సంతపేటలోని ఎం.పీ.డీ.వో. కార్యాలయానికి ఎదురుగా ఉన్న ప్రభుత్వ బాలుర వికలాంగుల వసతి గృహంలో ఏర్పాటు చేసిన 157వ నెంబరు పోలింగ్ కేంద్రంలో ఆయన ఓటు వేశారు. ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా అన్ని చర్యలు తీసుకున్నామని ఆయన చెప్పారు. జిల్లాలో 2183 పోలింగ్ కేంద్రాలలో 14వేల మందికి పైగా పోలింగ్ సిబ్బందిని విధులకు కేటాయించినట్లు తెలిపారు. రాజ్యాంగం ప్రసాదించిన ఓటు హక్కును అర్హులందరూ వినియోగించుకునేలా జిల్లా యంత్రాంగం చేపట్టిన చర్యలతో పెద్ద ఎత్తున ఓటర్లు పోలింగ్ కేంద్రాలకు వచ్చారని కలెక్టర్ చెప్పారు. ఇదే పోలింగ్ కేంద్రంలో తొలిసారి ఓటు హక్కును వినియోగించుకున్న ఒక యువతితో కలిసి కలెక్టర్ సెల్ఫీ పాయింటులో ఫోటో దిగారు.

# సీబీఎస్ఈ 12వ తరగతి ఫలితాలు విడుదల

## - అబ్బాయిల కన్నా అమ్మాయిలే ఎక్కువ సంఖ్యలో ఉత్తీర్ణత

**న్యూఢిల్లీ :** సీబీఎస్ఈ 12వ తరగతి ఫలితాలు ఇవాళ రిలీజ్ అయ్యాయి. ఆ పరీక్షల్లో అబ్బాయిల కన్నా అమ్మాయిలే ఎక్కువ సంఖ్యలో పాసయ్యారు. సీబీఎస్ఈ 12వ తరగతిలో 87.98 శాతం మంది విద్యార్థులు పరీక్షల్లో ఉత్తీర్ణులయ్యారు. గత ఏడాది 87.33 శాతం మంది పాసయ్యారు. ఈ ఏడాది 91.52 శాతం మంది అమ్మాయిలు పరీక్షలను క్లియర్ చేశారు. బాయ్స్ పర్సంటేజీ కన్నా అమ్మాయిలు 6.40 పర్సంటేజీ అదనంగా పాసయ్యారు. సుమారు 24 వేల మంది విద్యార్థులు ఈ పరీక్షల్లో 95 శాతం కన్నా ఎక్కువ మార్కులను సంపాదించారు. ఇక లక్షా 16 వేల మంది విద్యార్థులు 90 శాతం మార్కులను సాధించారు. కంపార్ట్మెంట్ లో 1.22 లక్షల మంది విద్యార్థులు ఉన్నట్లు ప్రకటనలో వెల్లడించారు. ఈసారి 16.21 లక్షల మంది విద్యార్థులు సీబీఎస్ఈ 12వ తరగతి పరీక్షలు రాశారు.

# తాడిపత్రిలో ఉద్రిక్తత

**అనంతపురం** అనంతపురం తాడిపత్రిలో ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. నియోజకవర్గంలో పోలీసుల నుంచి తెలుగుదేశం కార్యకర్తలు, నాయకులకు రక్షణ లేదని తెదేపా నాయకులు బైక్ ర్యాలీ నిర్వహించారు. ర్యాలీ జరుగుతున్న సమయంలోనే ఓం శాంతినగర్ లో వైకాపా నాయకులు రాళ్ల దాడికి తెగపడ్డారు. రాళ్లదాడికి భయపడిన పోలీసులు చుట్టుపక్కల ఇళ్లలో దూరి దాక్కునే పరిస్థితి నెలకొంది. రాళ్ల దాడిలో కొందరు పోలీసులకు గాయాలయ్యాయి. పలు వాహనాలు ధ్వంసమయ్యాయి.

# ఒక వర్గం ఓట్లను తొలగించారు

**హైదరాబాద్** షేక్ పేట్ డివిజన్ పరిధిలో దాదాపు 3 వేల ఓట్లను డిలీట్ చేశారని, ఒక వర్గానికి చెందిన ఓట్లను మాత్రమే డిలీట్ చేయడం దుర్మార్గమని సికింద్రాబాద్ బీజేపీ ఎంపీ అభ్యర్థి కిషన్ రెడ్డి అన్నారు. సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలోని జూబ్లీహిల్స్ అసెంబ్లీ సెగ్మెంట్ షేక్ పేట్ లో ఓట్లు గల్లంతైన పోలింగ్ కేంద్రాన్ని కిషన్ రెడ్డి పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ.. జూబ్లీహిల్స్ అసెంబ్లీ నియోజవర్గంలో కొంతమంది అధికారులు ఒక పథకం ప్రకారం ఒక వర్గం వారి ఓట్లు డిలీట్ చేయడం జరిగిందని అన్నారు. ఇది చాలా దుర్మార్గమని, వారంత అనేక సంవత్సరాలుగా ఇక్కడే ఓటింగ్ లో పాల్గొంటున్నారని, వారికి ఇక్కడే సొంత ఇళ్లు ఉన్నాయని, కొందరు ఉద్యోగస్తులు కూడా ఉన్నారని తెలిపారు.

# ఓటు హక్కు వినియోగించుకున్న బన్నీ

**హైదరాబాద్** సిని నటుడు అల్లు ఆర్జున్ తన ఓటు హక్కు వినియోగించుకున్నారు. నంద్యాల టూర్ పై క్లారిటీ ఇచ్చారు. నాకు ఏ రాజకీయ పార్టీలతో సంబంధం లేదు. మా మావయ్య పవన్ కళ్యాణ్ కు నా మద్దతు ఎపుడూ ఉంటుంది.
శిల్పా రవి నాకు 15 ఏళ్లుగా మిత్రుడు. అతనికి మద్దతు ఇస్తాను అని గతంలో మాట ఇచ్చాను. రాజకీయాలతో సంబంధం లేకుండా స్నేహితుడిగా మాత్రమే శిల్పా రవికి మద్దతుగా నంద్యాల వెళ్లాను. నాకు రాజకీయాల్లోకి వచ్చే ఉద్దేశం అస్సలు లేదు. ప్రతి ఒక్కరు ఓటు హక్కు వినియోగించు కోవాలని కోరుకుంటున్నానని అన్నారు.

# ఓటు వేసిన త్రిపుర గవర్నర్

**హైదరాబాద్** హైదరాబాద్ పార్లమెంట్ సెగ్మెంట్ లోని సలీం నగర్ జీహెచ్ఎంసి కమ్యూనిటీ హాల్ పోలింగ్ బూత్ నెంబర్ 204 లో త్రిపుర రాష్ట్ర గవర్నర్ నల్లు ఇంద్రసేనా రెడ్డి దంపతులు తన ఓటు హక్కును వినియోగించుకున్నారు

# అందరికి ధన్యావాదాలు

**భీమిలి** భీమిలి నియోజకవర్గం. అభ్యర్థి అవంతి శ్రీనివాసరావు భీమిలి లో ఓటు హక్కును వినియోగించుకున్నారు. భీమిలి నియోజవర్గ ప్రజలు నాకు మూడోసారి కూడా ఎమ్మెల్యే అభ్యర్థిగా ఎన్నుకుంటారని నమ్ముతున్నారు. ప్రజలు కూడా ఎంత ఎండ ఉన్న క్యూ లైన్ లో ఓపిగ్గా నిల్చని ఓటు వినియోగించుకుంటున్నారు. నాకు సహకరించిన కార్యకర్తలు బూతు ఏజెంట్లకు ఎంపీటీసీ జడ్పిటిసి కార్పొరేటర్లకి పేరుపేరునా ధన్యవాదాలు తెలిపారు

# ఏపీలో కమలం లెక్కేంటీ

**విజయవాడ :** పీ అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ మొత్తం 10 స్థానాల్లో పోటీ చేస్తోంది. మరి వీటిలో ఎన్ని దక్కించుకుంటుంది? ఎలా పోరాటం చేస్తుంది? అనేది ఆసక్తిగా మారింది. పోటీ చేసే స్థానాల్లో ఎస్సీలకు రిజర్వ్ చేసినవి కూడా ఉండడం గమనార్హం. బద్వేల్, విజయవాడ వెస్ట్, జమ్మలమడుగు, అరకు, ఆదోని, విశాఖ నార్త్, కైకలూరు, ధర్మవరం, అనపర్తి, ఎచ్చెర్ల. ఈ పది స్థానాల్లోనూ బీజేపీ ఒకటి రెండు మినహా.. అన్ని చోట్లా బలమైన అభ్యర్థులనే నిలిపింది. ఆర్థికంగా, రాజకీయంగా కూడా.. వారు బలంగా ఉండడం గమనార్హం. ఈ నేపథ్యంలోనే ఆ పది మంది గెలుపు ఉంటుందనేది ఆసక్తిగా మారింది.

**బద్వేల్:** కడప జిల్లాలోని ఎస్సీ నియోజకవర్గం. ఇక్కడ నుంచి బీజేపీ అభ్యర్థిగా సొంగా రోషన్‌కుమార్‌ను దింపారు. ఈయన ఆర్థికంగా బలంగా లేకపోవడం మైనస్. అయితే.. టీడీపీ తరపున ఉన్న కేడర్‌ను తనవైపు తిప్పుకొన్నారు. ఇది ఆయనకు ప్లస్ అవుతోంది. ఇక్కడ నుంచి వైసీపీ అభ్యర్థి డాక్టర్ సుధ బరిలో ఉన్నారు. ఈమెకు వైఎస్ అవినాష్ సహా పార్టీ నాయకులు అండ ఉంది. దీనికి తోడు మహిళ అనే సానుభూతి కూడా కలిసి వస్తోంది. దీంతో ఫైట్ టఫ్ అయినా.. గెలుపు సుధదేనని చెబుతున్నారు.

విజయవాడ వెస్ట్: అందరికీ కళ్లూ ఎక్కువగా పడిన నియోజకవర్గం విజయవాడ వెస్ట్. ఇక్కడ నుంచి సుజనా చౌదరి బీజేపీ తరపున పోటీలో ఉన్నారు. కోట్లకు కోట్లు కుమ్మరిస్తున్నారని వైసీపీ నాయకులు చెబుతున్నారు. ఇక్కడ టీడీపీ ఆయనకు కలిసి వస్తున్నా.. జనసేన తరపున ప్రచారంలో ఎవరూ కనిపించడం లేదు. పైగా మైనారి టీ ఓట్లు ఈయనకు పడే అవకాశం లేదు. నియోజకవర్గానికి చెందిన నాయకుడు కాదు. దీంతో ఈ సీటు దక్కడం అంత ఈజీ అయితే కాదు.

**జమ్మలమడుగు**: ఆదినారాయణరెడ్డి బరిలో ఉన్నారు. ఈయనకు బలమైన ఓటు బ్యాంకు ఉండడం.. స్థానికంగా పోల్ మేనేజ్‌మెంట్‌పై పట్టు ఉండడంతో ఈయన గట్టి పోటీ ఇచ్చినా ఇది వైఎస్ ఫ్యామిలీకి కంచుకోట కావడంతో ఆది గెలిస్తే సెన్సేషనే అవుతుంది. అరకు: ఇది ఎస్టీ నియోజకవర్గం. మోడీ ప్రభావం ఇక్కడ ఉంటుందని బీజేపీ ఆశలు పెట్టుకుంది. పైగా టీడీపీకి కూడా బలమైన నియోజకవర్గం. పంగి రాజారావును బీజేపీ ఇక్కడ నిలబెట్టింది. బలమైన వైసీపీ ఓటు బ్యాంకును చీల్చితేనే తప్ప.. ఇక్కడ ఆయన విజయం దక్కించుకోవడం సాధ్యం కాదనే వాదన ఉంది.

**ఆదోని:** కర్నూలు జిల్లా ఆదోని నుంచి బీజేపీ పీవీ పార్థసారథికి అవకాశం కల్పించారు. ఈయన గెలుపుపై భారీగానే ఆశలు ఉన్నాయి. కానీ, వైసీపీ ఓటు బ్యాంకు స్ట్రాంగ్? ఇక్కడ ఓటరు మరోసారి వైసీపీ సాయిప్రసాద్ రెడ్డి వైపే ఉన్నారంటున్నారు.

విశాఖ నార్త్: మాజీ ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజును ఇక్కడ నిలబెట్టారు. ఆయనకు ఉన్న ఇమేజ్. మంచితనం.. ప్రజల్లో ఉన్న సానుభూతి వంటివి కలిసి వచ్చే అవకాశం ఉంది. అయితే వైసీపీ నుంచి గత ఎన్నికల్లో ఓడి ఐదేళ్ల పాటు ప్రజల్లో ఉన్న కెకె రాజుతో గట్టి పోటీ ఎదురవుతోంది. ఇక్కడ కొద్దిగా ఛాన్స్ అయితే ఉంది.ః కైకలూరు: మాజీ మంత్రి కామినేని శ్రీనివాస్ ఇక్కడ నుంచి పోటీ చేస్తున్నారు. గత 2014లో గెలిచిన ఆయన మంత్రిగా కూడా చేశారు. ఇది ఆయనకు ప్లస్ అయ్యే అవకాశం ఉంది. గెలిచే అవకాశం కూడా ఉంది. ఇది బీజేపీ గెలిచే సీట్లలో ఒకటిగా పేర్కొంటున్నారు.

**ధర్మవరం:** బీజేపీ ఫైర్ బ్రాండ్ సత్యకుమార్ యాదవ్ ఇక్కడ బరిలో ఉన్నారు. ఆయన గెలుపు కోసం. టీడీపీ కూడా ప్రయత్నిస్తోంది. కానీ, వైసీపీ ఇక్కడ బలంగా ఉండడం. బీజేపీలోనే వరదాపురం సూరి.. ప్రచారానికి దూరంగా ఉండడం వంటివి సత్యకుమార్‌కు మైనస్‌గా మారాయి. ఇక్కడ గెలవడం సాధ్యం కాకపోవచ్చనే అంచనాలు కూడా వస్తున్నాయి.

అనపర్తి: ఈ సీటును బీజేపీ దక్కించుకునే అవకాశం ఉంది. ఇక్కడి టీడీపీ నాయకుడు నల్లమిల్లి రామకృష్ణారెడ్డికి చివరి నిమిషంలో బీజేపీ కండువాకప్పి.. టికెట్ ఇచ్చారు. ఇది బీజేపీకి మేలు చేసే అవకాశం ఉంది. సో.. ఇక్క డకూడా పార్టీ గెలిచే ఛాన్స్ ఉందంటున్నా ప్రస్తుతానికి గట్టి పోటీయే ఉంది.

**ఎచ్చెర్ల:** శ్రీకాకుళం జిల్లాలోని ఎచ్చెర్ల నియోజకవర్గం నుంచి ఎన్. ఈశ్వరరావుకు ఇచ్చారు. కానీ ఇక్కడ టీడీపీ నుంచి పెద్దగా సహకారం లేదనే టాక్ ఉంది. పైగా.. వైసీపీ బలంగా ఉండడంతో ఇక్కడ బీజేపీ గెలుపు గుర్రం ఎక్కే అవకాశం లేదు. కట్ చేస్తే: మొత్తంగా 10 స్థానాల్లో మూడు చోట్ల గట్టిపోటీ ఇచ్చిన బీజేపీ ఒకటి రెండు సీట్లు దక్కించుకునే అవకాశం ఉందని పరిశీలకులు చెబుతున్నారు. మరి ఏం జరుగుతుందో చూడాలి.

# రైతుల ధర్నా

**యాదాద్రి** యాదాద్రి భువనగిరి జిల్లా భూదాన్ పోచంపల్లి మండలంలోని కనుముక్కల గ్రామంలో, తడిసిన ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలని రైతులు ధర్నాకు దిగారు.ధాన్యం కొనుగోలు చేస్తేనే ఓటు వేస్తాము అని తడిసిన ధాన్యం బస్తాలతో పోలింగ్ కేంద్రమ్ దగ్గర రైతుల నిరసన తెలిపారు.

# రాయమాదారంలో ఎన్నికల బహిష్కరణ

**ఖమ్మం** ఖమ్మం జిల్లా ఏన్కూరు మండలం రాయమాదారంలో ఎన్నికలను గ్రామస్తులు బహిష్కరించారు. గ్రామంలో ఎన్ఎస్పి కెనాల్ పై బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని ఆందోళనకు దిగారు. విషయం తెలుసుకున్న ఎన్నికల అధికారులు గ్రామానికి చేరుకున్నారు. ఓటింగ్ వేయాలని వినతి చేసారు.

# మన దేవుళ్లతో స్పానిష్ కంపెనీ బిజినెస్..

# అమెరికాలో వీళ్లకు భలే గిరాకీ కూడా!

శుక్లాంబరధరం విష్ణుం.. ముద్దొచ్చే బొజ్జ గణపతి. కౌసల్య సుప్రజారామ.. నిలువెత్తు వేంకటేశ్వరుడు. తల్లీనిన్ను దలంచి.. చిరునవ్వుల సరస్వతీదేవి. వందే వందారు మందారం ఇందిరానంద కందలమ్..సిరులతల్లి లక్ష్మీదేవి. నాగేంద్రహారాయ త్రిలోచనాయ.. శివాత్మకమైన మహా లింగం. అంతేనా.. తథాగత బుద్ధుడు, కరుణామయుడైన క్రీస్తు, ప్రేమైక జీవులు రాధాకృష్ణులు.. ఇలా అనేకానేక రూపాలు మనల్ని ఆధ్యాత్మిక జగత్తువైపు లాక్కెళ్తాయి. దేనికదే అపురూపం. ప్రతి బొమ్మలోనూ జీవకళ, అంతులేని వింత కాంతి. వీటిని తయారుచేసింది ఏ భారతీయ సంస్థో కాదు. స్పానిష్ లగ్జరీ పోర్సలిన్ బ్రాండ్.. లాడ్రో! స్పెయిన్ నుంచి వచ్చి మరీ మన దేవతల విగ్రహాలను విక్రయించడం వెనుక లాడ్రోకు పెద్ద వ్యూహమే ఉంది. ఇప్పటికే, లాడ్రో వ్యాపారంలో పదకొండు శాతం భారత్ నుంచే జరుగుతున్నది. ఆ వాటా ఇంకొంత పెంచాలన్నది ఆలోచన. పాశ్చాత్య శిల్పాలు, గృహాలంకరణ వస్తువులు కూడా






తయారీదారులు. ఈ మధ్యే లాడ్రో ఢిల్లీలో సువిశాలమైన షోరూమ్‌ను ప్రారంభించింది. 'భారత్‌లో విస్తరించాలనే ప్రయత్నంలో ఇది తొలి అడుగు' అంటారు ఆ సంస్థ సీఈవో అనా రోడ్రిగ్స్. భారతీయ సంస్కృతికి ప్రపంచవ్యాప్తంగా ఆదరణ పెరుగుతున్నది. ఆ అవగాహన వల్లే కావచ్చు.. స్పిరిట్ ఆఫ్ ఇండియా కలెక్షన్‌కు ఇక్కడి కంటే అమెరికాలోనే గిరాకీ ఎక్కువ' అంటారు ఆమె.






విక్రయిస్తున్నా.. 'స్పిరిట్ ఆఫ్ ఇండియా' కలెక్షన్‌లో భాగమైన దేవతా మూర్తులకే గిరాకీ ఎక్కువ. వీటి ధరలు ఎనిమిదివేల రూపాయల నుంచి రెండున్నర కోట్ల వరకూ ఉంటాయి. ఈ మధ్యే లిమిటెడ్ ఎడిషన్‌గా తీసుకొచ్చిన 'కృష్ణార్జున-గీతా సందేశం' విగ్రహాలు శరవేగంగా అమ్ముడవుతున్నాయి. ధర అక్షరాలా ముప్పై తొమ్మిది లక్షలు. కలియుగ ప్రత్యక్ష దైవం వేంకటేశ్వర స్వామి విగ్రహానికి లభిస్తున్న ఆదరణ ఆ విదేశీ సంస్థను ఆశ్చర్యానికి గురిచేసింది. దీంతో ధరను రూ. పద్దెనిమిదిన్నర లక్షల నుంచి అమాంతం ముప్పై లక్షలకు పెంచేశారు. ఆన్‌లైన్ విక్రయాలు కూడా గణనీయంగా పెరిగాయని చెబుతున్నారు





# ఫ్యాటీ లివర్‌తో బాధపడుతున్నారా..

# అయితే ఈ టిప్స్ మీ కోసమే..!



ఇప్పుడు ప్రపంచ మానవాళి ఎదుర్కొంటున్న అనారోగ్య సమస్యల్లో ఫ్యాటీ లివర్ కూడా ఒకటి. ఈ ఫ్యాటీ లివర్ సమస్యతో బాధపడే వారు సరైన ఆహార నియమాలు పాటించకపోతే తీవ్రత మరింత ముదిరే ప్రమాదం ఉంది. కాబట్టి ఎలాంటి ఆహార పదార్థాలు తీసుకుంటే ఫ్యాటీ లివర్ సమస్య పెరగకుండా ఉంటుంది..? ఎలాంటి ఆహార పదార్థాలు తీసుకుంటే సమస్య మరింత ముదురుతుంది..? అనేది ఇప్పుడు తెలుసుకుందాం..

సమస్యను తగ్గించే పదార్థాలు

### వెల్లుల్లి

కాలేయ వాపు (ఫ్యాటీ లివర్) సమస్యపై చేసిన అనేక పరిశోధనల ప్రకారం.. ఈ వ్యాధితో బాధపడుతున్న వారు ఆ సమస్య నుంచి బయట పడాలంటే వెల్లుల్లి చాలా బాగా ఉపయోగపడుతుంది. ఎందుకంటే వెల్లుల్లిలో కొవ్వును తగ్గించగల శక్తితోపాటు ఆరోగ్యానికి మేలు చేసే చాలా పోషకాలు ఉన్నాయి.

### గ్రీన్ టీ

ఫ్యాటీ లివర్‌కు చెక్ పెట్టడంలో యాంటీ ఆక్సిడెంట్లను సమృద్ధిగా కలిగి ఉన్న గ్రీన్ టీ కూడా మెరుగ్గా పని చేస్తుంది. ఈ యాంటీ ఆక్సిడెంట్లు కణాలను రిపేర్ చేయడంతో పాటు బరువు తగ్గడంలో తోడ్పడుతాయి. అదేవిధంగా మన శరీరంలోని చెడు కొలెస్ట్రాల్‌ను తొలగించి ఫ్యాటీ లివర్‌ని సమస్యను తగ్గించడంలో కూడా ఇవి కీలకపాత్ర పోషిస్తాయి.

### అవకాడో

ఫ్యాటీ లివర్ సమస్యతో బాధపడుతున్న వారికి అవకాడో చాలా ఉపయోగకరంగా ఉంటుంది. ఈ అవకాడోలోని పోషకాలు ఫ్యాటీ లివర్ సమస్యను తగ్గించి కాలేయాన్ని ఎంతో సురక్షితంగా ఉంచడంతోపాటు బరువు తగ్గడానికి దోహదపడుతాయి.

## సమస్యను పెంచే పదార్థాలు

### పాస్తా, ఫ్రైడ్ రైస్, వైట్ బ్రెడ్

కాలేయంలో వాపు సమస్య ఉన్నవాళ్లు పాస్తా, ఫ్రైడ్ రైస్, వైట్ బ్రెడ్ లాంటి ప్రాసెస్డ్ ఫుడ్స్‌కు చాలా దూరంగా ఉండాలి. ఎందుకంటే ప్రాసెస్ చేసిన ఆహార పదార్థాల్లో ఫైబర్ తక్కువగా ఉంటుంది. వీటిని తినడంవల్ల శరీరంలో షుగర్ లెవెల్స్ ఈజీగా పెరుగుతాయి. చక్కెరలు పెరిగినప్పుడు కాలేయంలో కొవ్వు ఎక్కువగా పేరుకుపోతుంది. దాంతో ఫ్యాటీ లివర్ సమస్య మరింత తీవ్రతరం అవుతుంది.

### చాక్లెట్, లడ్డూ, ఐస్ క్రీమ్, కూల్ డ్రింక్స్

చక్కెరలు ఎక్కువగా ఉండే చాక్లెట్, లడ్డూ, ఐస్ క్రీమ్, కూల్ డ్రింక్ లాంటి పదార్థాలు కూడా ఫ్యాటీ లివర్ సమస్య ఉన్నవారికి ప్రమాదకరం. వాటితో కాలేయంలో చక్కెరలు చేరి ఫ్యాటీ లివర్ సమస్య మరింత తీవ్రమయ్యే ప్రమాదం ఉంది.

# స్వచ్ఛంద సంస్థలు, అనాథ శరణాలయాలకు విరాళాలు ఇస్తున్నారా?

# ముందు ఈ విషయాలు తెలుసుకోవడం చాలా ముఖ్యం!

ఎవరి సంపాదన వారిది. ఎవరి ఖర్చులు వారివి. చివరగా మిగిలిన సొమ్ములోంచి కాస్తంత మొత్తాన్ని స్వచ్ఛంద సంస్థలు, వృద్ధాశ్రమాలు, అనాథ శరణాలయాలకు విరాళంగా ఇవ్వాలనుకునేవారూ ఉంటారు. మంచి ఆలోచనే. సంఘజీవిగా అది బాధ్యత కూడా. మరో కోణంలో చూస్తే.. మానసిక సంతృప్తి కోసం మనం పెడుతున్న పెట్టుబడి అది. అందులో ప్రతి రూపాయీ మన స్వార్జితమే. ఆ సొమ్ము దుర్వినియోగం కాకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలి.

దాతృత్వం అనేది బలమైన పాజిటివ్ ఎమోషన్. పంచుకోవడంలోని ఆనందం అనిర్వచనీయం. దీనివల్ల మన జీవితానికి సార్థకత లభించిన అనుభూతి కలుగుతుంది. లేనివారితో పంచుకోవడం ఉన్నవారి బాధ్యత కూడా. కాబట్టే, ఆర్థిక మానసిక వేత్తలు దాతృత్వాన్ని 'మానవీయ పెట్టుబడి'గా అభివర్ణిస్తారు. షేర్ మార్కెట్‌లో పెట్టుబడులు దీర్ఘకాలంలో మన ఆస్తుల విలువను పెంచినట్టు.. విరాళాలు, దానాలు, సేవ.. హ్యాపీనెస్ ఇండెక్స్‌లో మన గ్రాఫ్‌ను పైపైకి తీసుకెళ్తాయి. 'ఓ అనాథ శరణాలయానికి నేనిచ్చిన విరాళమే నా జీవితంలో అత్యుత్తమ పెట్టుబడి' అంటారు వారెన్ బఫెట్. కానీ, సమాజం కోసం మనం కేటాయించిన సొమ్ము అందాల్సినవారికి అందినప్పుడే.. ఆ అనుభూతి, ఆనందాలకు సార్థకత. కాబట్టి సంస్థల ఎంపికలో, వ్యక్తుల బేరీజులో చాలా జాగ్రత్తగా వ్యవహరించాలి. ఎవరు ఏ లక్ష్యంతో పనిచేస్తున్నారన్నది తెలుసుకోవాలి.



ఉద్దేశం ఆత్మసంతృప్తి. మనకు ఇష్టమైన, మన జీవితంతో ముడిపడిన సత్కార్యానికి డబ్బు కేటాయించినప్పుడు.. ఆ సంతృప్తి రెట్టింపు అవుతుంది. కాబట్టి తగిన ఎన్జీవోనే కాదు, ఆ సంస్థ కార్యకలాపాలను కూడా పరిగణనలోకి తీసుకోవాలి.

### కళ్లారా చూడండి..

అవార్డులు, బ్యాలెన్స్‌షీట్, పత్రికలలో కథనాలు.. అన్నీ ఒక ఎత్తు.

### సరైన ఎన్జీవో కోసం..



దినపత్రికలలో ప్రకటనలు, సోషల్ మీడియాలో ప్రచారాలు, తరచూ పలకరించే ఎస్సెమ్మెస్‌లు, కూడళ్ల దగ్గర పంచే కరపత్రాలు.. సాయం కోరుతూ, మద్దతు కోసం విజ్ఞప్తి చేస్తూ ఏదో ఓ రూపంలో మన దృష్టిని ఆకర్షించే ప్రయత్నం జరుగుతూనే ఉంటుంది. దేశంలో ముప్పై లక్షలకు పైగా ఎన్జీవోలు (ప్రభుత్వేతర స్వచ్ఛంద సంస్థలు) ఉన్నట్టు గణాంకాలు చెబుతున్నాయి. పేదల కోసం, అనాథల కోసం, వృద్ధుల కోసం, శారీరక-మానసిక వికలాంగుల కోసం, పర్యావరణం కోసం, రాజకీయ చైతన్యం కోసం.. ఇలా తమదైన రంగంలో నిజాయతీగా పని చేస్తున్న సంస్థలు అనేకం. దాతృత్వ ప్రధాన

అంతిమంగా మీరు కళ్లారా చూసిందే నిజం. మీకు నచ్చితేనే నచ్చినట్టు. కాబట్టి, మనసుకు దగ్గరగా అనిపించిన ఎన్జీవోను ఎంచుకోగానే.. ఓ పూట ఆ ఆవరణకు వెళ్లండి. అక్కడి పిల్లలు, అనాథలు, నిర్భాగ్యులతో మాట్లాడండి. అదే రంగంలో పనిచేస్తున్న మిగతా సంస్థలనూ సందర్శించండి. ఏ సంస్థ ఎక్కువ జీవితాలను ప్రభావితం చేస్తున్నది, ఏ సంస్థకు బతుకులను మార్చే శక్తి ఉంది, ఎవరి చేతిలో పెడితే కనుక మీ కష్టార్జితం సద్వినియోగం అవుతుంది.. అనేది కోణంలో ఆలోచించండి. కొన్ని సంస్థలు.. ఆ మొత్తాన్ని ఎలా ఖర్చుచేస్తున్నది, ఎవరికి సాయం చేస్తున్నది తెలియజేస్తూ న్యూస్‌లెటర్ కూడా ఇస్తాయి.

ఇలాంటి సమాచారం వల్ల.. మనకు ఆ ఎన్జీవో పట్ల నమ్మకం పెరుగుతుంది. ఆత్మీయులకు సిఫారసు చేస్తాం కూడా. దాతృత్వానికి పెట్టుబడి సూత్రాలను జోడిస్తున్నవారూ ఉన్నారు. నెలనెలా కొంత మొత్తాన్ని సిస్టమెటిక్ ఇన్వెస్ట్‌మెంట్ ప్లాన్ (సిప్)కు మళ్లించి.. దీర్ఘకాలంలో భారీ మొత్తాన్ని విరాళంగా ఇస్తున్నారు. దీనివల్ల మరింత మొత్తం పోగవుతుంది.

మరిన్ని జీవితాలు బాగుపడుతాయి. ప్రతినెలా గుర్తుంచుకుని చెల్లించడం కష్టం అనిపిస్తే.. ఎలక్ట్రానిక్ క్లియరెన్స్ సిస్టమ్ (ఈసీఎస్) ద్వారా నెలనెలా ఫలానా తేదీన నిర్ణీత మొత్తాన్ని ఏదైనా ఎన్జీవో బ్యాంకు ఖాతాకు బదిలీ చేయవచ్చు. ఎంచుకున్న సంస్థ వెబ్‌సైట్‌లోకి వెళ్లి క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయడమూ ఒక పద్ధతి. నేరుగా డబ్బు ఇవ్వకపోయినా.. మన వృత్తి నైపుణ్యాన్ని ఆయా ఎన్జీవోల కోసం వినియోగించడం ద్వారానూ ఆత్మసంతృప్తి పొందవచ్చు. ఇది ఆర్థికేతర సేవ. మనం గీసిన పెయింటింగ్స్, మనం రాసిన పుస్తకాలు, మనం చెక్కిన శిల్పాలు.. విక్రయించడం ద్వారా వచ్చిన మొత్తాన్ని కూడా నలుగురి కోసం మళ్లించవచ్చు. మనకు సేద్యం ఉంటే, పంటలో కొంత భాగాన్ని పేదలకు పంచవచ్చు. మనసుంటే మార్గాలు అనేక. దారి ఏదైనా దాతృత్వం గొప్ప లక్షణం.

### పన్ను మినహాయింపు..

విరాళాల ద్వారా ఆదాయపన్ను ప్రయోజనాన్నీ పొందొచ్చు. ఇన్‌కమ్‌టాక్స్ యాక్ట్-1961లోని సెక్షన్ 80 జీ ప్రకారం.. యాభై నుంచి నూరు శాతం పన్ను వినహాయింపు లభిస్తుంది. కానీ, ఆ విరాళం మన మొత్తం ఆదాయంలో పదిశాతానికి మించకూడదు. అయితే, ఇక్కడో నిబంధన ఉంది.

మనం విరాళం అందించిన సంస్థలకు 80 జీ రిజిస్ట్రేషన్ తప్పక ఉండాలి. అప్పుడే, నోటిఫైడ్ సంస్థల జాబితాలో చోటు లభిస్తుంది. మినహాయింపులకు వీలూ ఉంటుంది. కొత్త టాక్స్ విధానాన్ని ఎంచుకునేవారికి ఈ మినహాయింపు వర్తించదు. పాత పద్ధతినే ఎంచుకున్నా.. రెండు వేల రూపాయలకు మించిన నగదు విరాళాలు ఈ పరిధిలోకి రావు. దుస్తులు, వస్తువులు, ఆహారం, పుస్తకాల రూపంలో ఇచ్చిన విరాళాలు కూడా 80 జీ కింద అనర్హమైనవే.

# నెలసరి రావాలంటే మందులు వాడాల్సి వస్తుంది..

# ఈ సమస్యకు కారణం బరువు పెరగడమేనా?



నా వయసు 21 సంవత్సరాలు. ఎత్తు 5 అడుగుల 4 అంగుళాలు. బరువు 65 కేజీలు. మూడేళ్ల నుంచి పీసీఓడీ సమస్య ఉంది. లాక్‌డౌన్‌లో బరువు పెరిగాను. ఆ తర్వాతే ఈ ఇబ్బంది వచ్చింది. ప్రస్తుతం నెలసరి రావాలంటే డాక్టర్ ఇచ్చిన మందులు వాడాల్సి వస్తున్నది. నేను బరువు పెరగడం వల్లే ఈ సమస్య వచ్చిందా. బరువు తగ్గితే తగ్గిపోతుందా?

**- ఓ పాఠకురాలు**

అవును, కచ్చితంగా బరువు పెరగడం వల్లే మీకు ఈ సమస్య వచ్చింది. అలాగే వేళకు తిండి, నిద్రలేని జీవనశైలి కూడా ఇందుకు కారణం కావచ్చు. బరువు పెరిగితే విసరల్ ఫ్యాట్ కూడా ఎక్కువ అవుతుంది. అంటే ఆడపిల్లల్లో పొట్టచుట్టూ చేరే కొవ్వు ఇది. దీనివల్ల శరీరంలోని ఇన్సులిన్ సరిగ్గా పనిచేయదు. దాంతో అండం సమయానికి విడుదల కాదు. వీటన్నిటి వల్లా నెలసరి సక్రమంగా రాదు. దాన్ని సరిచేసేందుకు హార్మోన్ మాత్రలు వాడాల్సి వస్తున్నది.కాబట్టి ముందు మీరు బరువు తగ్గండి. సరైన ఆహారాన్ని తీసుకుని, వ్యాయామాన్ని రోజువారీ కార్యక్రమాల్లో భాగం చేసుకోండి. పచ్చళ్లు, స్వీట్లు, చక్కెర, వేపుళ్ల లాంటివి దూరం పెట్టండి. అలా అని పూర్తిగా తిండి మానేయకూడదు. ఉదయాన్నే నడక ప్రారంభించాలి. ఇవన్నీ చేస్తూ బరువు తగ్గాలి. అప్పుడు పీసీఓడీ తగ్గి, గర్భం ధరించడమూ సులభం అవుతుంది. లేకపోతే ప్రెగ్నెన్సీ సమయంలో బీపీ, షుగర్‌లాంటివి రావడమే కాదు, అబార్షన్లు ఎక్కువగా జరిగే ప్రమాదమూ ఉంది. కాబట్టి డాక్టర్ ఇచ్చిన మందులు వాడుతూనే బరువు తగ్గే ప్రయత్నం చేయండి. వరుసగా మూడు నెలలు నెలసరి రాకపోతే గర్భాశయంలో ఉండే పొర మందం అయిపోయి, మరికొన్ని కొత్త సమస్యలకు దారితీస్తుంది. జాగ్రత్త.

# సత్తు షర్బత్..

## వేసవిలో శరీరానికి

## వేడిచేయకుండా కాపాడుతుంది..!

**కావలసినవి:** వేయించిన శనగపప్పు కప్పు, నిమ్మకాయలు రెండు, పంచదార పొడి రెండు టేబుల్ స్పూన్లు, పుదీనా ఆకులు ఏడు, పచ్చిమిర్చి ఒకటి (సన్నగా తరగాలి), జీలకర్ర పొడి అరటీస్పూను, బ్లాక్ సాల్ట్ పావు టీస్పూను, సాధారణ సాల్ట్ పావు టీస్పూను, ఐస్‌క్యూబ్స్ పావు కప్పు. **తయారీ:** శనగపప్పుని మిక్సీజార్‌లో వేసి మెత్తగా పొడిచేయాలి. ఈ పొడిని జల్లెడపట్టుకుని ఒకగిన్నెలోకి తీసుకోవాలి.˘శనగపిండిలో కొద్దిగా నీళ్లుపోసి ఉండలు లేకుండా కలపాలి. తరువాత కప్పు నీళ్లుపోసి మరోసారి కలుపుకోవాలి˘ఇప్పుడు దీనిలో బ్లాక్‌సాల్ట్, సాధారణ సాల్ట్, పంచదార పొడి, జీలకర్ర పొడి, పచ్చిమిర్చి తరుగు, నిమ్మరసం, పుదీనా ఆకులను సన్నగా తరిగి వేసి చక్కగా కలపాలి˘చివరిగా ఐస్‌క్యూబ్స్ వేసి సర్వ్‌చేసుకుంటే సత్తు షర్బత్ ఎంతో రుచిగా ఉంటుంది. ఈ షర్బత్‌లోని ఉప్పు, ఐరన్, పీచుపదార్థం జీర్ణక్రియను సక్రమంగా జరిగేలా చేసి గ్యాస్, ఎసిడిటీ, మలబద్ధకం వంటి సమస్యలను దరిచేరనివ్వవు.దీనిని పరగడుపున తీసుకుంటే మరింత బాగా పనిచేస్తుంది

శరీరంలోని టాక్సిన్‌లను బయటకు పంపి మంచి డీటాక్సింగ్ ఏజెంట్‌గా పనిచేస్తుంది. వేసవిలో రోజుకొక గ్లాస్ తాగితే.. దాహం తీరడంతోపాటు, శరీరానికి వేడిచేయకుండా ఉంటుంది.

# పోలింగ్ కేంద్రాలను సందర్శించిన చింతమనేని ప్రభాకర్

**దెందులూరు** పెదవేగి మండలంలోని కవ్వగుంట, గార్లమడుగు, జగన్నాథ పురం సహా పలు గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను కూటమి దెందులూరు ఎమ్మెల్యే అభ్యర్థి చింతమనేని ప్రభాకర్ సందర్శించారు. చిరు నవ్వుతో ఓటర్లకు నమస్కారం పెడుతూ, అధికారులతో స్నేహపూర్వకంగా చర్చిస్తూ, ఓటర్లకు ఎండ తీవ్రత కలగకుండా చర్యలు చేపట్టాలని సూచిస్తూ ఎన్నికల సరళిని పరిశీలించారు.

## ఓటు హక్కు వినియోగించుకున్న
# కేశినేని శివనాథ్ దంపతులు

**విజయవాడ** టిడిపి విజయవాడ పార్లమెంట్ ఎంపి అభ్యర్థి గా పోటీ చేస్తున్న కేశినేని శివనాథ్ (చిన్ని) దంపతులు వారి ఓటు హక్కును వినియోగించుకున్నారు. సోమవారం ఉదయం విజయవాడ తూర్పు నియోజకవర్గం ఆంధ్ర లయోల కాలేజీ పి.జి. బ్లాక్ రూమ్ నెంబర్ ఐ.పి.4 లో కేశినేని శివనాథ్ తన కటుంబ సభ్యులతో కలిసి ఓటు వేశారు. కేశినేని శివనాథ్ వెంట సతీమణి జానకి లక్ష్మీ, కుమారుడు వెంకట్, కూతురు స్నిగ్ధ, తల్లి ప్రసున్నాంబ వారి ఓటు హక్కును వినియోగించుకున్నారు. పోలింగ్ బూత్ లో జరుగుతున్న ఎన్నికల సరళిని గమనించారు. ఓటర్లకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా, ఎన్నికలు నిష్పాక్షపాతంగా జరిగేలా చూడాలని ఎన్నికల అధికారులను కోరారు.

# పులివెందుల ఈవియం పంపిణీ కేంద్రంలో గాలి వాన భీభత్సం

**కడప** కడప జిల్లా పులివెందులలో గాలివాన బీభత్సం సృష్టించింది. ఈదురు గాలులు చిరు జల్లులు పడడంతో ఎన్నికల కోసం జేఎన్టీయూ లో ఏర్పాటు చేసిన తాత్కాలిక టెంట్లు కుప్పకూలిపోయాయి. కుర్చీలు కింద పడ్డాయి. వర్షం పడే సమయానికి ఎన్నికల సిబ్బంది వారి కి సంబంధించిన కిట్లతో అందరూ బస్సులు ఎక్కారు.

# నిర్భయంగా స్వేచ్ఛగా ఓటు హక్కును వినియోగించు కోవాలి

**కోనసీమష** కోనసీమ జిల్లా పరిధిలో ఓటు హక్కును పలువురు ప్రముఖులు తో పాటు పలువురు అభ్యర్థులు వినియోగించుకున్నారు. జిల్లా కలెక్టర్ హిమాన్స్ శుక్ల ఎదరపల్లిలో, ఎన్డీఏ అమలాపురం లోక్సభ అభ్యర్థి గంటి హరీష్ మాధుర్ అమలాపురంలో, పిసిసి మాజీ అధ్యక్షుడు రాజమండ్రి పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి గిడుగు రుద్దరాజు, అమలాపురం అసెంబ్లీ ఎన్డీఏ అభ్యర్థి ఐతాబత్తుల ఆనందరావు ఎస్సీ యానంలో, మండపేట వైసిపి అభ్యర్థి తోట త్రిమూర్తులు మండపేటలో, రామచంద్రపురం ఉమ్మడి కూటమి అభ్యర్థి వాసంశెట్టి సుభాష్ రామచంద్రపురం లో ఓటు హక్కు వినియోగించుకున్నారు.

# గెలిపించండి..అందుబాటులో వుంటాను

**పాకాల** చిత్తూరు జిల్లా పాకాల (మం) పులివర్తివారి పల్లెలో పోలింగ్ బూత్ 166లో టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పులివర్తి నాని దంపతులు ఓటు హక్కు వినియోగించుకున్నారు. మార్పుకోసం ప్రజలు ఎదురు చూస్తున్నారు. ప్రజలను గత 10 సం' బానిసలుగా చూస్తున్న వారికి బుద్ధి చెప్పే సమయం వచ్చింది. మంచి, చెడులు ఆలోచించి ఇటు వినియోగించుకోవాలి. గెలిచిన తర్వాత శాంతిభద్రతలు కాపాడుతాను. ఓటు హక్కు వినియోగించుకున్న. టజాయి రహిత నియోజకవర్గంగా తయారు చేస్తాను. యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తాను. బడుగు బలహీన వర్గాలకు అండగా ఉంటాను. ఎమ్మెల్యే చెవిరెడ్డి ప్రతిచోటా అల్లర్లు సృష్టించి ఓటింగ్ శాతం తగ్గించేందుకు ప్రయత్నిస్తున్నారు. అవకాశం ఇవ్వకుండా సాయంత్రం 6 వరకు పోలింగ్ పై దృష్టి పెడుతున్నాం. ఎక్కడ ఏం జరిగినా వెంటనే మా ఫ్యామిలీ మెంబర్స్ వస్తారు.. స్థానిక పోలీసుల దృష్టికి తీసుకెళుదామని అన్నారు.

## ఓటు హక్కును వినియోగించుకున్న
# వేమిరెడ్డి దంపతులు

**నెల్లూరు** నెల్లూరు పార్లమెంటు ఎన్డిఏ ఎంపీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, కోవూరు ఎమ్మెల్యే అభ్యర్థి వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకున్నారు. నెల్లూరు రూరల్ పరిధిలోని మాగుంట లేఔట్ లో ఉన్న ఎస్ఆర్కె ఇంగ్లీష్ మీడియం పాఠశాలకు చేరుకున్నవారు క్యూలో నిల్చుని ఓటు వేశారు. వారితో పాటు ఓటు వేసిన వారిలో కుమార్తె నీలిమారెడ్డి కోడలు ఐషితారెడ్డి ఉన్నారు.

# టీడీపీ ఏజెంట్‌పై దాడి

**పల్నాడు** పల్నాడు జిల్లా ముప్పాళ్ళ మండలం తొండపి గ్రామంలో ఉద్విక్త వాతావరణం నెలకొంది. టిడిపి ఏజెంట్ను మరియు ఓటు వేసేందుకు వచ్చిన ఓటర్లను వైసిపి కార్యకర్తలు కర్రలతో కొట్టారు. బాధితులకు ముక్కుకు కాళ్లకు తీవ్రమైన గాయాలు అయ్యాయి. వారిని సత్తెనపల్లి ఏరియా వైద్యశాలలోతరలించి చికిత్స అందిస్తున్నారు.

# వంశీ,యార్లగడ్డ వర్గీయుల ఘర్షణ

**కృష్ణాజిల్లా** గన్నవరం మండలం ముస్తాబాద్ వద్ద ఉద్రిక్తత నెలకొంది. వల్లభనేని వంశీ, యార్లగడ్డ వెంకట్రావు వర్గీయులు మధ్య తోపులాట జరిగింది. ఒకరిపై ఒకరు చెప్పులతో రాళ్ళతో కొట్టుకున్నారు. అటు వల్లభనేని వంశీ, ఇటు యార్లగడ్డ వెంకట్రావు వారి వారి కార్లలో ఉండగా రోడ్డుపై ముస్తాబాద్ ఫ్లై ఓవర్ వద్ద జరిగిన ఘర్షణ జరిగింది. పోలీసులు ఇరువర్గాలను సర్ది చెప్పి పంపించారు.

# చీరాలో టీడీపీ అభ్యర్ది కారు ధ్వంసం

**బాపట్ల** బాపట్ల జిల్లా చీరాలలో తెలుగుదేశం పార్టీ అసెంబ్లీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న ఎం.ఎం. కొండయ్యపై వై సి పీ వర్గీయులు దాడికి దిగారు. ఎం.ఎం.కొండయ్య కార్ పై దాడి చేసి ధ్వంసం చేశారు. తెలుగుదేశం కార్యకర్తలు, నాయకులు,అభిమానులపై కర్రలతో దాడికి పాల్పడ్డారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని అదుపులోకి తీసుకుని వచ్చారు.

# గుంటూరులో వైకాపా, టీడీపీ ఘర్షణ

**గుంటూరు** గుంటూరు రాయపాటి వీరయ్య చౌదరి ప్రాథమిక పాఠశాల బూతులో దొంగ ఓట్లు వేసేందుకు టీడీపీ ప్రయత్నం చేసింది. సమాచారం తెలిసి అడ్డుకునేందుకు వైసీపీ అభ్యర్థిని విడదల రజని, ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి అక్కడకు చేరుకున్నారు. ఇద్దరిపై టీడీపీ కార్యకర్తలు దూషణలకు దిగారు. ఇరువర్గాల మధ్య వాగ్వాదం, తోపులాటజరిగింది. పోలీసులు స్వల్పంగా లాఠీలు ఝుళిపించి ఇరు వర్గాలను తరిమేసారు.

# పోలీసులు తగు జాగ్రత్తలు తీసుకోవాలి

**పులివెందుల** కడప జిల్లా పులివెందుల నియోజకవర్గంలోని సింహాద్రిపురం మండలం కసునూరు గ్రామంలోని బూత్ నెంబర్ 9 లో టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి బీటెక్ రవి తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు.

తరువాత అయన మీడియాతో మాట్లాడుతూ ఇప్పటివరకు ఓటింగ్ బాగా జరిగిందని ఇకనుంచి కూడా బాగా జరిపించేలా పోలీసులు చర్యలు తీసుకోవాలని కోరారు. మద్యాహ్నం నుండి కవ్వింపు చర్యలకు పాల్పడకుండా పోలిసులు తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. సాయంత్రం వరకు ఇలాగే పోలింగ్ కొనసాగించాలని కోరారు. ఇదివరకు ఎన్నడూ లేనివిధంగా పోలింగ్ నమోదు అవుతుందన్నారు.

# ఆహ్లాద కర వాతావరణంలో పోలింగ్ స్టేషన్

**కాకినాడ** ప్రజాస్వామ్యంలో ఓటు విలువను తెలియజెప్పి, ఓటర్లలో చైతన్యం కలిగించడమే లక్ష్యంగా కాకినాడ నగరంలో 4 మోడల్ పోలింగ్ స్టేషన్లను ఏర్పాటు చేసారు. చక్కని సదుపాయాలతో పాటు పోలింగ్ స్టేషన్లోకి ఆహ్లాదకరవాతావరణంలో వెళ్ళి ఓటింగ్ వేసేందుకు వీలుగా సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. ప్రధానంగా యువత, మహిళలు, దివ్యాంగులు లక్ష్యంగా ఏర్పాటైన ఆయా థీమ్ పోలింగ్ స్టేషన్లలో ఆ కేటగిరికి చెందిన ఉద్యోగులనే ఏర్పాటు చేయడం ద్వారా ఓటర్లను ఆలోచింపచేసేలా తీర్దిదిద్దారు. .కాకినాడ సిటి నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి జె. వెంకటరావు పర్యవేక్షణలో ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు వీటిని ఏర్పాటు చేసినట్లు ఆయన తెలియజేసారు

# కూటమికే ప్రజల మద్దతు

**కాకినాడ** కాకినాడ నగరంలో ప్రజలు చైతన్యం కలిగి ఉన్నారని, ఓటుతో రాక్షస పాలనను ముగించేందుకు సిద్ధంగా ఉన్నట్లు ఉన్నారని ., పోలింగ్ శాతంను చూస్తుంటే., అర్ధం అవుతోందని కాకినాడ సిటి టిడిపి, జనసేన, బిజెపి కూటమి అభ్యర్థి వనమాడి కొండబాబ పేర్కొన్నారు. సోమవారం కాకినాడ నగరంలో పలు పోలింగ్ స్టేషన్కు వెళ్ళి పోలింగ్ సరళిని ఆయన స్వయంగా పరిశీలించా రు. ఈ సందర్భంగా కూటమి అభ్యర్థి వనమాడి మాట్లాడుతూ పోలింగ్ సరళిని పరిశీలిస్తుంటే ప్రజంతా కూటమికే మద్దతు ఇస్తున్నట్లు కనబడుతోందన్నారు.కాకినాడ నగరంలో ప్రశాంతమైన వాతవరణంలో పోలింగ్ జరుగుతోందని,ప్రతి ఒక్కరు తమ ఓటు హక్కును వినియోగించు కోవాలని కాకినాడ పార్లమెంట్ నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థి ఎం.ఎం. పల్లంరాజు పిలుపునిచ్చారు. సాలిపేట గర్ల్స్ హైస్కూల్లో ఆయన తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. అనంతరం కాకినాడ నగరంలోని జగన్నాధపురంలో ఎం.ఎస్.ఎన్ చార్టీస్ పోలింగ్ను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఎం.ఎం. పల్లంరాజు మీడియాతో మాట్లాడారు.

## మావోయిస్టుల ఇలాకాలో
# ప్రశాంతంగా ముగిసిన పోలింగ్

**భద్రాద్రి** మావోయిస్టుల ఇలాకాలో పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. పోలీస్ ఫ్లాగ్ మార్చ్ సత్ఫలితాలిచ్చింది. భారీ భద్రత నడుమ పోలింగ్ జరిగింది. ఓటర్లు నిర్భయంగా ఓటు హక్కును వినియోగించుకున్నారు. పట్టణ కేంద్రంలో కన్నా సమస్యాత్మక కేంద్రల్లో పోలింగ్ శాతం ఎక్కువ నమోదైయింది. సమస్యాత్మక కేంద్రాలపై స్పెషల్ ఫోకస్ పోలీసులు పెట్టారు. సమస్యాత్మక కేంద్రాల్లో 75% పైగా పోలింగ్ జరిగింది. లింగాపురంలో ఈవీఎం అరగంట పాటు మొరాయించింది. అనుకున్న సమయానికే ముందస్తు ప్రణాళికలో భాగంగా అన్నీ కేంద్రాల ఈవియమ్ లను భారీ భద్రత నడుమ మండల కేంద్రానికి తరలించారు..

# నాలుగు గంటలకు ముగిసిన పోలింగ్

పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో సమస్యాత్మక ప్రాంతంలో ఉదయం 7 నుంచి సాయంత్రం 4 గంటలకే ఓటింగ్ ముగించాలని ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు మంథనిలోని కొన్ని పోలింగ్ బూతులలో నాలుగు గంటలకే ఓటింగ్ ముగిసింది. పెద్దపల్లి జిల్లా మంథని పట్టణంలోని మఠంవీధి మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో నిర్వహిస్తున్న రెండు ఎన్నికల పోలింగ్ బూతులను నాలుగు గంటలకే అధికారులు క్లోజ్ చేశారు.పోలింగ్ కేంద్రంలోని ఈవీఎం మెషీన్ లను, వీవీ ప్యాట్ , కంట్రోల్ యూనిట్ లను అధికారులు సీల్ వేసేశారు.

# వరంగల్, మహబూబాబాద్ లో ముగిసిన పోలింగ్

**వరంగల్** వరంగల్, మహబూబాబాద్ పార్లమెంట్ నియోజక వర్గాల్లో పోలింగ్ ముగిసింది. మహబూబాబాద్, వరంగల్ పార్లమెంట్ సెగ్మెంట్లలో ప్రశాంతంగా పోలింగ్ ముగిసింది. 6 గంటలకు పోలింగ్ కేంద్రాల గేట్లు మూసివేసారు. 6గంటలలోపు చేరుకున్న వారికి ఓటు వినియోగించేందుకు అనుమతినిచ్చారు. ఉదయం పలు పోలింగ్ కేంద్రాల్లో ఈవీఎంలు మొరాయించడంతో టెక్నికల్ టీమ్స్ పునరుద్ధరించారు. ఏజెన్సీ ప్రాంతాల్లో వరంగల్ పార్లమెంట్ నియోజక పరిధిలో భూపాలపల్లి, మహబూబాబాద్ పార్లమెంట్ నియోజక వర్గ పరిధిలోనీ ములుగు,పినపాక, ఇల్లందు, భద్రాచలం నియోజకవర్గాల్లో 4గంటలకే న పోలింగ్ ముగిసింది. నిన్న రాత్రి వర్షం కారణంగా పలు పోలింగ్ కేంద్రాల్లో ఇబ్బందులు వచ్చాయి. ములుగు జిల్లాలోని ఈవీఎం లను ప్రభుత్వ డిగ్రీ కాలేజ్ కు తరలింపు. ఎలాంటి అవాంచనీయ ఘటనలు జరగకపోవడంతో పోలీసులు ఊపిరి పీల్చుకున్నారు. ఏజెన్సీ జిల్లాలనుండి ప్రత్యేక భద్రత మధ్య ఈవీఎంలను స్ట్రాంగ్ రూమ్ లకు తరలించారు.

## తెలంగాణలో మధ్యాహ్నం 3 గంటల వరకు
# 52.34 శాతం పోలింగ్

**హైదరాబాద్ :** తెలంగాణలో లోక్‌సభ ఎన్నికలకు పోలింగ్ ప్రక్రియ ప్రశాంతంగా కొనసాగుతోంది. మధ్యాహ్నం 3 గంటల వరకు 52.34 శాతం పోలింగ్ నమోదైంది. కంటోన్మెంట్ ఉప ఎన్నికలో 39.92 శాతం పోలింగ్ నమోదైంది.ఆదిలాబాద్ పార్లమెంట్ పరిధిలో 62.44 శాతం, భువనగిరిలో 62.05 శాతం, చేవెళ్లలో 42.35 శాతం, హైదరాబాద్‌లో 29.47 శాతం, కరీంనగర్‌లో 58.24 శాతం, ఖమ్మంలో 63.67 శాతం, మహబూబాబాద్‌లో 61.40 శాతం, మహబూబ్‌నగర్‌లో 58.92 శాతం, మల్కాజ్‌గిరిలో 37.69 శాతం, మెదక్‌లో 60.94 శాతం, నాగర్‌కర్నూల్‌లో 57.17 శాతం, నల్లగొండలో 59.91 శాతం, నిజామాబాద్‌లో 58.70 శాతం, పెద్దపల్లిలో 55.92 శాతం, సికింద్రాబాద్‌లో 35.48 శాతం, వరంగల్‌లో 54.17 శాతం, జహీరాబాద్‌లో 63.96 శాతం పోలింగ్ నమోదైంది.

## శ్రీశైలంలో మధ్యాహ్నం వరకు
# ప్రశాంతంగా జరిగిన ఎన్నికలు

- మధ్యాహ్నం నుండి భారీ వర్షం కారణంగా తగ్గిన ఓటర్లు

- వర్షం సైతం లెక్కచేయకుండా పోలింగ్ పోలింగ్ సెంటర్లకు పోటెత్తిన జనం





**శ్రీశైలం** శ్రీశైల దేవస్థానంలో సోమవారం రోజున జరిగిన ఓటింగ్ లో ఓటర్లు పెద్దఎత్తున పాల్గొని ఓటును వినియోగించుకున్నారు. అయితే మధ్యాహ్నం నుండి శ్రీశైలంలో భారీ ఈదురుగాలులతో కూడిన వర్షం పడడంతో దీంతో ఓటు వేసేందుకు వచ్చినవారు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. వర్షం సైతం లెక్కచేయకుండా ఇబ్బందులు ఎదురైనా ఓటు వేయడానికి వచ్చి ఓటు వినియోగించుకోడం జరిగింది. ఓపికగా నిరీక్షిస్తున్న ఓటర్లపై ప్రశంసలు కురుస్తున్నరు. కొందరు మాత్రం వర్షం కారణంగా ఇళ్ల నుంచి బయటికి రావడం లేదు. ఇది పోలింగ్ శాతంపై ప్రభావం చూపే అవకాశం ఉంది.

# ఓటు వేయడం మన బాధ్యత, ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును వినియోగించుకోవాలి



**జగిత్యాల :** పార్లమెంట్ ఎన్నికల్లో భాగంగా మున్సిపల్ చైర్ పర్సన్ అడువాల జ్యోతి- లక్ష్మణ్ సోమవారం జగిత్యాల పట్టణంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల నూతన భవనంలోని 161 పోలింగ్ బూత్ లో మున్సిపల్ చైర్ పర్సన్ తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ఓటు హక్కు వజ్రాయుధమని, ప్రతి ఒక్కరూ స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు. పాజిటివ్ ఓటింగ్ జరుగుతుందని, ప్రజాస్వామ్యాన్ని కాపాడడానికి ప్రజలు ఉత్సహకంగా పాల్గొంటున్నారని, గతంలో కంటే పోలింగ్ మెరుగ్గా ఉంటుందని, ప్రతి ఒక్కరూ ఆలోచించి ఓటు వేయాలని కోరారు. ఓటు అనేది 5 సంవత్సరాల భవిష్యత్ నిర్ణయించేదని, పట్టణ ప్రాంత ప్రజలు ఓటింగ్ లో పాల్గొనేందుకు ముందుకు రావాలని కోరారు. ఓటు వేయడం మన బాధ్యత అని, ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు.

# ప్రశాంతంగా ముగిసిన పార్లమెంట్ ఎన్నికలు

సోమవారం జరిగిన పార్లమెంటు ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. దీంతో జిల్లా ఎన్నికల అధికారులు, పోలీసులు భద్రతా సిబ్బంది ఒక్కసారిగా ఊపిరి పీల్చుకున్నారు. ఓటర్లు.. తమ తీర్పును ఈవీఎంలలో నిక్షిప్తం చేశారు. పోలింగ్ కోసం ఎన్నికల సంఘం విస్తృత ఏర్పాట్లు చేసింది. సున్నిత, సమస్యాత్మక ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించింది. నియోజకవర్గంలో 61.55శాతం పోలింగ్ నమోదు అయ్యింది. మంథని నియోజకవర్గంలో మంథని, ముత్తారం, కమాన్పూర్, రామగిరి, మలహర్,కాటారం, మహ ముత్తారం, పలిమేల,మహాదేవపూర్, మండలాలు ఉండగా కొన్ని పోలింగ్ కేంద్రాల వద్ద ఉదయం ఉదయం నుంచి ప్రజలు బారులు తీరారు. కొన్ని పోలింగ్ కేంద్రాల వద్ద ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు పోలింగ్ మందకొడిగా సాగింది. మావోయిస్టు ప్రభావిత ప్రాంతాలైన సిర్పూర్, చెన్నూరు, బెల్లంపల్లి, మంచిర్యాల, ఆసిఫాబాద్, మంథని, భూపాలపల్లి, ములుగు, పినపాక, ఇల్లందు, కొత్తగూడెం, అశ్వరావుపేట, భద్రాచలం నియోజకవర్గాల్లో సాయంత్రం 4 గంటలకే పోలింగ్ ముగిసింది. అప్పటికి క్యూలైన్లో ఉన్నవారందరికి ఓటు వేసే అవకాశం లభించింది. మంథని నియోజకవర్గంలో నియోజకవర్గంలో మొత్తం 2,39,699 మంది ఓటర్లు ఉండగా అందులో 1.17,352 మంది పురుషులు,1,22,329 మంది మహిళలు,18 మంది థర్డ్ జెండర్లు ఓటర్లుగా ఉన్నారు. నియోజకవర్గంలో ఉదయం 9 గంటల వరకు 10.17 శాతంగా, 11 గంటలకు 27.41 శాతంగా, మధ్యాహ్నం ఒంటిగంటకు 48.21 శాతంగా, మూడు గంటలకు 56.2 శాతంగా ఓటింగ్ నమోదయింది. సాయంత్రం ఐదు గంటల వరకు పెద్దపెల్లి పార్లమెంట్ నియోజకవర్గ వ్యాప్తంగా 63.86 శాతం ఓటింగ్ నమోదైనట్టు అధికారులు వెల్లడించారు. నియోజకవర్గంలో జరుగుతున్న ఎన్నికల సరళని జిల్లా అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షించారు .

ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా స్థానిక పోలీసులతో, జాతీయ భద్రతా బలగాలతో భారీ బందోబస్తును ఎన్నికల అధికారులు చేపట్టారు. మంథని పట్టణంలో రామలింగం పోలీస్ కమిషనర్ శ్రీనివాస్ హలో పోలింగ్ స్టేషన్లను సందర్శించి పోలీస్ అధికారులకు తగు సలహాలు సూచనలను అందించి అప్రమత్తం చేశారు. పోలింగ్ ముగిసిన తర్వాత ఈవీఎం లను కట్టుదిట్టమైన భద్రత మధ్య స్ట్రాంగ్ రూముకు తరలించారు.

# ప్రశాంతంగా ముగిసిన పోలింగ్



**సి. బెలగల్** సార్వత్రిక ఎన్నికలలో భాగం సి. బెలగల్ మండలంలో పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. మండలంలో ఏర్పాటు చేసిన 49 పోలింగ్ కేంద్రాల్లో కొన్ని చోట్ల ఉదయం ఈ. వి. ఎం లు మొరాయించి పోలింగ్ ఆలస్యం అయ్యింది.సాయంత్రం 6 గంటల వరకు క్యూ లైన్లలో నిలుచున్న ప్రతి ఒక్కరికీ ఓటు వేసుకునే అవకాశం కల్పించారు .మండల వ్యాప్తంగా దాదాపు 70శాతం ఓటింగ్ నమోదు జరిగించింది.మండలంలో ఎలాంటి ఘర్షణలు జరగకుండా పోలీస్ సిబ్బంది ప్రతిష్టమైన బందోబస్తు నిర్వహించారు.

# నరసరావుపేటలో కాల్పులు

**పల్నాడు** నరసరావుపేటలో పోలీసులు కాల్పులు జరిపారు. . స్థానిక ఎమ్మెల్యే ఇంటిపై దాడికి పాల్పడ్డవారినీ కంట్రోల్ చేస్తూ రబ్బర్ బుల్లెట్ల ప్రయోగంచేసారు.

# ఓటు హక్కును వినియోగించుకున్న ప్రముఖులు

**హైదరాబాద్ :** రాష్ట్ర వ్యాప్తంగా లోక్‌సభ ఎన్నికల పోలింగ్ కొనసాగుతున్నది. ఉదయం నుంచే పెద్ద సంఖ్యలో ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకుంటున్నారు. మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు, త్రిపుర గవర్నర్ ఎన్. ఇంద్రసేనారెడ్డి, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి సహా పలువురు ప్రముఖులు ఉదయాన్నే కుటుంబ సభ్యులతో కలిసి ఓటువేశారు. హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లోని ఓబుల్‌రెడ్డి స్కూల్‌లో మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాడు తన సతీమణితో కలిసి ఓటుహక్కు వినియోగించుకున్నారు. త్రిపుర గవర్నర్ ఎన్. ఇంద్రసేనారెడ్డి సలీంనగర్‌లోని పోలింగ్ కేంద్రంలో కుటుంబ సమేతంగా ఓటువేశారు. కాచిగూడలోని దీక్ష మోడల్ స్కూల్‌లో కుటుంబ సభ్యులతో కలిసి కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ఓటువేశారు. ఇక పులివెంబులు బాకరాపురంలో ఏపీ సీఎం జగన్, గుంటూరు జిల్లా ఉండవల్లిలో సతీమణి భువనేశ్వరితో కలిసి చంద్రబాబు ఓటుహక్కు వినియోగించుకున్నారు. కరీంనగర్‌లోని ఓల్డ్ హైస్కూల్‌లో బీఆర్‌ఎస్ అభ్యర్థి వినోద్ కుమార్, అలంపూర్‌లో నాగర్‌కర్నూల్ బీఆర్‌ఎస్ అభ్యర్థి ఆర్‌ఎస్ ప్రవీణ్ కుమార్, పాలకుర్తిలో మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు, మహబూబ్‌నగర్‌లో శ్రీనివాస్ గౌడ్, వనపర్తిలో నిరంజన్‌రెడ్డి, సూర్యాపేటలో జగదీశ్ రెడ్డి, మెదక్‌లో మాజీ ఎమ్మెల్యే పద్మా దేవేందర్ రెడ్డి, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చుంచుపల్లి మండలం విద్యానగర్ కాలనీలో సీపీఐ ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, నర్సాపూర్ బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి తన స్వగ్రామమైన గోమారంలో ఓటుహక్కు వినియోగించుకున్నారు.

## ఎన్నికలను బహిష్కరించిన వంక బొత్తప్పగూడెం గ్రామ ఓటర్లు

**ఏలూరు** కొయ్యలగూడెం మండలం వంక బొత్తప్పగూడెం గ్రామ ఓటర్లు ఎన్నికలను బహిష్కరించారు. గ్రామాన్ని ఐటీడీఏ పరిధిలో లో కలపాలని ఎన్నికలను బహిష్కరించారు. 2019 ఎన్నికల్లో కూడా ఇదేవిధంగా ఎన్నికలను బహిష్కరించారు.

## ఓటు వేసిన సత్యవేడు ఉమ్మడి టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి కోనేటి ఆదిమూలం

**చిత్తూరు** సత్య వేదు నియోజక వర్గం తెదేపా ఉమ్మడి ఎంఎల్ఏ అభ్యర్థి శ్రీ కోనేటి ఆది మూలం తన అమూల్యమైన ఓటును వినియోగించుకున్నారు ప్రజలు తమ ఓటును ప్రశాంతమైన వాతావరణంలో ఉపయోగించుకోవాలని , నియోజక వర్గం లో వుండే ఓటర్లు అందరు తమ అమూల్య మైన ఓటును ఉపయోగించుకోవాలని కోరడం జరిగింది...

## ఎన్నికల్లో పాల్గోనని భోజరాజుపురం గ్రామస్థులు

**విజయనగరం** దత్తిరాజేరు మండలం గుచ్చిమి పంచాయతీలోని భోజరాజుపురం చెందిన గ్రామస్థులు ఎన్నికలను బహిష్కరించారుర. గడిచిన ఐదేళ్లుగా తమ గ్రామానికి ఎలాంటి అభివృద్ధి జరగలేదని అందుకే ఎన్నికలను బహిస్కరిస్తున్నామని అన్నారు. ఇది వరకే కలెక్టర్ కి, స్థానిక వైసిపి ఎమ్మెల్యే బొత్స అప్పల నరసయ్యకు పలుమార్లు వినతిపత్రాలు గ్రామస్థులు ఇచ్చారు. ఎన్ని సార్లు వినతి పత్రాలు ఇచ్చినా అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించలేదని అన్నారు. తమ విన్నపాలకు న్యాయం జరగలేనప్పుడు, ఎన్నికల్లో పాల్గొని ఉపయోగం ఏమి ఉందంటూ గ్రామస్థులు ప్రశ్నించారు. ఎన్నికలను బహిష్కరించిన గ్రామంలో 205 మంది ఓటర్లు వున్నారు. 2.5 కి.మీ మేర రోడ్డు నిర్మాణం చేయలేని పాలకలకు ఉంటే ఎంత.....లేకపోతే ఎంత అంటూ ఆగ్రహంవ్యక్తం చేసారు.

## జనసేన, వైకాపా నేతల మధ్య ఘర్షణ

**బాపులపాడు** బాపులపాడు జడ్పీ హైస్కూల్ పోలింగ్ కేంద్రంలో జనసేన వైసిపి నేతల మధ్య ఘర్షణ చేలరేగింది. జనసేన ఏజెంట్లను బయటకు పంపిస్తున్నారు అంటూ ఫిర్యాదులు రావడంతో పోలింగ్ కేంద్రం వద్దకు జనసేన సమన్వయకర్త చలమశెట్టి రమేష్ బాబు చేరుకున్నారు. వైసీపీ నేత గోసుల శివ భారత్ రెడ్డి పోలింగ్ కేంద్రంలోని జనసేన ఏజెంట్లను బయటకి పంపిస్తున్నారని చలమల శెట్టి రమేష్ బాబు ఆగ్రహం వ్యక్తం చేసారు. ఇరువురు నేతల మధ్య తీవ్ర వాదోప వాదనలు చోటు చేసుకున్నాయి. పోలీసులు ఇరు వర్గాలకు సర్ది చెప్పారు.

## పోలీంగ్ స్టేషన్‌లో సొమ్మసిల్లి పడిపోయిన మహిళ

**గిద్దలూరు** ప్రకాశం జిల్లా, గిద్దలూరు నియోజకవర్గంలో ఎన్నికలు నిర్వహణ ఏర్పాట్ల లో అధికారులు విఫలమైయారు. దీంతో ఓటర్లు సరైన వసతులు లేక (నీళ్లు) తీవ్రంగా ఇబ్బంది పడ్డారు. గిద్దలూరు పట్టణంలోని జిల్లా పరిషత్ బాయ్స్ హై స్కూల్ నందు 183 బూత్ లో ఓ మహిళ సొమ్మసిల్లి పడిపోయింది.

## ప్రజాస్వామ్యాన్ని గెలిపించాలి

**కడప** కడప జిల్లా వేంపల్లె మండలం,ఇడుపుల పాయ పోలింగ్ బూత్ 261 లో బ్రదర్ అనిల్ కుమార్ తో కలిసి కడప ఎంపీ అభ్యర్థి వైఎస్ షర్మిలా రెడ్డి తన ఓటు హక్కును వినియోగించుకున్నారు.వైఎస్ షర్మిలా రెడ్డి మాట్లాడుతూ భారత రాజ్యాంగం మనకు కల్పించిన హక్కు. పాలకులను ఎంచుకొనే హక్కు రాజ్యాంగం మనకు ఇచ్చింది. ఓటు ముందు ధనవంతుడు అయినా ఒకటే...పేదవాడు అయినా ఒకడే. ఓటు సమానమైన హక్కు. ఓటు వేయడం ఒక భాధ్యత. కడప జిల్లా అభివృద్ధి కోసం, రాష్ట్ర అభివృద్ధి కోసం అందరూ ఓటు హక్కును వినియోగించుకోండి. జరుగుతున్న దాడులపై ఈసీ తక్షణం చర్యలు తీసుకోవాలి. ప్రజాస్వామ్యాన్ని గెలిపించాలి. పోలింగ్ బూత్ లో ఈవీఎం లు ధ్వంసం చేసిన వాళ్లపై చర్యలు తీసుకోవాలి..అభ్యర్థిని బహిష్కరించాలని అన్నారు.

## ఓటు వినియోగించుకున్న బాలకృష్ణ దంపతులు

**హిందూపురం** టీడీపీ నేత నందమూరి బాలకృష్ణ ఓటు హక్కు వినియోగించుకున్నారు. శ్రీసత్యసాయి జిల్లా హిందూపురంలో ఓటు వేశారు. ప్రజాస్వామ్య రక్షణకు ఓటు పవిత్రమైన ఆయుధమని, ప్రజలందరూ ఓటు హక్కు వినియోగించుకోవాలని కోరారు.

## కుటుంబంతో కలిసి ఓటు వేసిన మంత్రి వనిత

**యర్నగూడెం** గోపాలపురం నియోజకవర్గం వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి రాష్ట్ర హోం మంత్రి డాక్టర్ తానేటి వనిత కుటుంబ సభ్యులతో కలసి తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. దేవరపల్లి మండలం యర్నగూడెం బూత్ నెంబర్ 88 లో ఓటును వినియోగించుకున్నారు. హోం మంత్రి తానేటి వనితతో పాటు భర్త తానేటి శ్రీనివాసరావు, కుమార్తె ప్రణవి ఓటింగ్ లో పాల్గొన్నారు. హోంమంత్రి తండ్రి జొన్నకూటి బాబాజీ రావు - వీల్ చైర్ లో వచ్చి ఓటు హక్కును వినియోగించుకున్నారు.

## ఓటు హక్కు వినియోగించుకున్న ప్రముఖులు



పార్లమెంటు సార్వత్రిక ఎన్నికల్లో సోమవారం పలువురు ప్రముఖులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు.మంథని పట్టణంలో బీజేపీ పెద్దపల్లి జిల్లా అధ్యక్షులు చంద్రుపట్ల సునీల్ రెడ్డి , మంథని మాజీ ఎమ్మెల్యే చంద్రుపట్ల రాంరెడ్డి , ఆయన సతీమణి వసుమతి మంథని పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన పోలింగ్ బూత్ లో తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని వారు పిలుపునిచ్చారు. అదేవిధంగా పెద్దపల్లి పార్లమెంటుకు స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేస్తున్న బూడిద తిరుపతి తన స్వగ్రామమైన మంథని మండలం నాగారంలో తన ఓటు హక్కును వినియోగించుకున్నారు.

## జహీరాబాద్‌లో కాంగ్రెస్ గెలుపు ఖాయం

**- మంత్రి దామోదర రాజనర్సింహ**

**మెదక్** తెలంగాణలో అత్యధిక పార్లమెంట్ సీట్లు కాంగ్రెస్ కైవసం చేసుకుంటుందని మంత్రి దామోదర్ రాజనర్సింహ అన్నారు. జహీరాబాద్ పార్లమెంట్ అభ్యర్థి సురేష్ శెట్కార్ భారీ మెగారిటీతో గెలుపొంద బోతున్నారు. రాష్ట్రంలో 12 నుండి 14 పార్లమెంట్ స్థానాలను కాంగ్రెస్ పార్టీ సాధిస్తుంది అనే విశ్వాసం ఉంది. తెలంగాణలో త్రిముఖ పోటీ లేదని అన్నారు

## అంబెద్కర్ విగ్రహం తల తొలగించిన దుండగులు

**నెల్లూరు** నెల్లూరు జిల్లా వెంకటగిరి పట్టణంలో గుర్తు తెలియని వ్యక్తులు దుశ్చర్యకు పాల్పడ్డారు. వెంకటగిరి పట్టణం రైల్వే స్టేషన్ రోడ్డు నందు డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహాన్ని తల తొలగించారు దుండగులు. సోమవారం తెల్లవారుజామున గుర్తు తెలియని దుండగులు అంబేద్కర్ తలను ధ్వంసం చేసినట్లు గుర్తించారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు.

## పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించిన కలెక్టర్ ప్రియాంక

**భద్రాద్రి** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, అశ్వారావుపేటలో స్థానిక అగ్రికల్చర్ కాలేజీ ప్రాంగణంలో ఈవీఎం డిస్ట్రిబ్యూషన్ సెంటర్ ను పరిశీలించిన జిల్లా కలెక్టర్ ప్రియాంక అలా సిబ్బందికి తగు సూచనలు చేసారు. ప్రిసైడింగ్ అధికారులు చెక్ లిస్ట్ ఆధారంగా క్రమపద్ధతిలో తమ విధులను నిర్వహించాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘిస్తే చర్యలు తప్పవన్నారు. 13వ తేదీన ఉదయం 5 గంటల్లోగా ఏజెంట్లు పోలింగ్ కేంద్రాలకు చేరుకోవాలని, 7 గంటలకు పోలింగ్ ప్రక్రియ ప్రారంభించాలని స్పష్టం చేశారు.

## మచిలీపట్నంలో టీడీపీ పోలింగ్ ఏజెంట్‌పై వైసీపీ నేతల దాడి

**మచిలీపట్నం** మచిలీపట్నంలో టీడీపీ పోలింగ్ ఏజెంట్ పై వైసీపీ నేతలు దాడికి దిగారు. సర్కారుతోటలోని 46వ పోలింగ్ బూత్ లో ఘటన జరిగింది. దాడిలో పోలింగ్ ఏజెంట్ రత్నాకర్ తీవ్రంగా గాయపడ్డారు. పోలింగ్ ఏజెంట్ గా సంతకం చేసేందుకు వెళ్లిన రత్నాకర్ పై కొంత మంది వైసీపీ కార్యకర్తలు దాడికి దిగారు. ఇరువర్గాల మధ్య వాగ్వివాదం, తోపులాట జరిగింది. పోలీసులు బలగాలు ఘటనా స్థలికి చేరుకుని ఇరువర్గాలను చెదరగొట్టారు.

## హనుమాన్ నగర్ పోలింగ్ బూత్‌లో పండగ వాతావరణం

**ఏలూరు :** ఏలూరు లో హనుమాన్ నగర్ 114, 115 పోలింగ్ బూత్ వద్ద పండగ వాతావరణం నెలకొంది. ఓటర్లను ఆహ్వానిస్తూ మామిడి తోరణాలు, అరటి చెట్లు, బెలూన్ డెకరేషన్ తో పండగ వాతావరణం కనిపించింది. పోలింగ్ కేంద్రాల వద్ద షామియానా, త్రాగునీరు, ఆరోగ్య శిబిరాలు ఏర్పాటు చేసారు. ఓటు వేసేందుకు వచ్చి ఏర్పాట్లపై ఓటర్లు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ట్రైనీ కలెక్టర్ శ్రీపూజ తొలిసారి ఓటు హక్కు వినియోగించుకున్నారు.

## ఎన్నికలు సజావుగా జరుగుతున్నాయి

**- తంగిరాల సౌమ్య**

**నందిగామ** ఎన్నికలు సజావుగా ప్రశాంత వాతావరణంలో జరుగుతున్నాయని నందిగామ ఎన్డీయే కూటమి తెదేపా అభ్యర్థి తంగిరాల సౌమ్య అన్నారు. ఈ సందర్భంగా ఆమె మీడియాతో మాట్లాడుతూ.. ఉదయం 7 గంటల నుంచి మహిళలు అత్యధిక సంఖ్యలో ఓటు హక్కు సద్వినియోగం చేసుకోవటానికి రావటం హర్షించ దగ్గ విషయమని అన్నారు. యువకులు ముందుకు వచ్చి ఓటు హక్కు సద్వినియోగం చేసుకోవడంపై హర్షం వ్యక్తం చేశారు.

## ప్రజాస్వామ్య స్ఫూర్తి అంటే ఇదే

**అల్లూరి** రోడ్లు, వాహనాలున్నా కొంత మంది ఓటు వేయడానికి బద్ధకిస్తుంటారు. కానీ ఏపీలోని అల్లూరి సీతారామరాజు జిల్లాలో ఓ ఘటన ప్రజాస్వామ్య స్ఫూర్తిని చాటింది. అటవీ ప్రాంతంలో ఉండే గిరిజనులు తమకు సరైన రోడ్డు సౌకర్యం లేకపోవడంతో ఓ వృద్ధ మహిళను ఓటు వేయడానికి డోలీలో తీసుకెళ్లారు. వీరిని చూసైనా ఓటు వేసేందుకు జనాలు ముందుకు రావాలని పలువురు అభిప్రాయపడుతున్నారు .

## ఈవీఎంలపై అభ్యంతరం

**నల్గొండ** నల్లగొండ జిల్లా భువనగిరి కాంగ్రెస్ పార్లమెంట్ అభ్యర్థి చామల కిరణ్ కుమార్ రెడ్డి ఈవీఎం పై అభ్యంతరం వ్యక్తం చేశారు. మూడు ఈవీఎం ఫ్యానల్లు ఉన్నాయి.. వివిద ఫ్యానల్లో నేషనల్ పార్టీలు ఉండటం వలన మొదటి స్థానంలో ఉన్న గుర్తులు తారుమారు అవుతున్నాయి. మూడో ఈవీఎం ఫ్యానళ్ళు నుంచి ఓటర్లు పంపిన ఓట్లు తారుమారు అవుతున్నాయి దీనిపై రిటర్న్ అధికారుల తీరు బాగాలేదు. రాష్ట్రవ్యాప్తంగా ఇదేవిధంగా కొనసాగుతుందని దీనిపై కేంద్ర ఎన్నికల సంఘం చర్యలు తీసుకోవాలని అని అన్నారు....

## పోలీంగ్ కేంద్రాలను పరిశీలించిన సైబరాబాద్ సీపీ



**మేడ్చల్** పార్లమెంట్ ఎన్నికలు జరుగుతున్న నేపథ్యంలో కుత్బుల్లాపూర్ నియోజకవర్గం లోని పలు పోలింగ్ సైబరాబాద్ పోలీస్ కమిషనర్ అవినాష్ మహంతి పరిశీలించారు. క్రిటికల్ పోలింగ్ లొకేషన్ చైతన్య విద్యానికేతన్ స్కూల్, మక్దూమ్ నగర్, సందర్శించారు. పోలింగ్ ప్రక్రియ ఉ బందోబస్తు గమనించి, శాంతియుత పోలింగ్ను నిర్వహించేందుకు మరిన్ని సూచనలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బాలానగర్ డిసిపి శ్రీనివాస్ రావు, బాలానగర్ ఏసీపీ హన్మంత్ రావు,జగతగిరిగుట్ట సీఐ క్రాంతి కుమార్ తదితరులు పాల్గొన్నారు....

## ఓటు వేసి ఆదర్శంగా నిలిచిన.. జాకీర్ పాషా

**- కాలితో సంతకం చేస్తున్న జాకీర్ పాషా**



**కాగజ్ నగర్** కొమురం బీమ్ ఆసిఫాబాద్ జిల్లా కాగజ్ నగర్ పట్టణంలోనిఫారెస్ట్ డివిజన్ ఆఫీసులో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రంలో రెండు చే లు లేని దివ్యాంగుడు జాకీర్ పాషా ఓటు వేసి ఆద ర్శంగా నిలిచాడు. కుటుంబ సభ్యులతో కలిసి పోలింగ్ కేంద్రానికి చేరుకున్న పాషా కాలి సాయంతోనే సంతకం చేసిన అనంతరం ఓటు వేశాడు. కాగా జాకీర్ పాషా కాలి సహాయంతోనే పెయింట్లు వేయడంతో పాటు రోజువారీ పనులు చేసుకుంటున్నాని తెలిపారు.

## భూపాలపల్లిలో ప్రశాంతంగా పోలింగ్

**- జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రా**

**జయశంకర్ భూపాలపల్లి :** వరంగల్ పార్లమెంట్ పరిధిలోని భూపాలపల్లి అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావు లేకుండా పోలింగ్ ప్రక్రియ ప్రశాంతంగా జరుగుతున్నట్లు జిల్లా ఎన్నికల అధికారి భవేశ్ మిశ్రా అన్నారు. ఉదయం నుండి ఓటర్ల చైతన్యం వెల్లివిరుస్తున్నదని అధిక సంఖ్యలో ఓటర్లు పోలింగ్ కేంద్రాల్లో బారులు తీరి ఉన్నారని తెలిపారు. ప్రతి ఒక్కరూ ఓటు హక్కు వినియోగానికి పోలింగ్ కేంద్రాలకు తరలివస్తున్నారని హర్షం వ్యక్తం చేశారు. సాయంత్రం 4 గంటల వరకు మాత్రమే ఓటు హక్కు వినియోగానికి సమయం ఉన్నదని, సమయం మించిపోయే వరకు ఓటర్లు వేచి ఉండక, పోలింగ్ కేంద్రాలకు విచ్చేసి ఓటు హక్కును వినియోగించు కోవాలని ఆయన సూచించారు. కలెక్టరేట్ కార్యాలయపు సమావేశపు హాలులో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూము నుండి పోలింగ్ ప్రక్రియను వెబ్ కాస్టింగ్, సి సి కెమెరాలు ద్వారా పరిశీలిస్తూ సత్వర ఓటింగ్ జరిగేందుకు, పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లు రద్దీ నియంత్రణ చర్యలు తదితర అంశాలపై సిబ్బందికి ఆదేశాలు జారీ చేస్తున్నారు.

## సామాన్యుడిలా ఓటు హక్కు వినియోగించుకున్న జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్

**పెద్దపల్లి** లోక్ సభ పోలింగ్ సందర్భంగా పెద్దపల్లి కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ముజమ్మిల్ ఖాన్ సామాన్యుడిలా క్యూ లైన్ లో నిలబడి తన ఓటు హక్కు వినియోగించుకున్నారు. సోమవారం కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ముజమ్మిల్ ఖాన్ పెద్దపల్లి పార్లమెంట్ పరిధిలోని పెద్దపల్లి అసెంబ్లీ సెగ్మెంట్ లో రంగంపల్లిలోని మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రం సంఖ్య 79 లో తన ఓటు హక్కు వినియోగించుకున్నారు. అనంతరం కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ముజమ్మిల్ ఖాన్ మాట్లాడుతూ లోక్ సభ ఎన్నికల పోలింగ్ సజావుగాజరుగుతుందని, రంగంపల్లి పోలింగ్ కేంద్రంలో ఉన్న తన ఓటు హక్కును తాను బాధ్యతగా వచ్చి వినియోగించుకోవడం జరిగిందని తెలిపారు.పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్ల కోసం అవసరమైన అన్ని రకాల ఏర్పాట్లు పూర్తి చేశామని , ప్రజలు తమకు అందించిన పోలింగ్ స్లిప్పులతో పాటు ఓటర్ ఐ.డి. కార్డు లేదా ప్రభుత్వం జారీ చేసిన 12 గుర్తింపు కార్డులలో ఏదైనా ఒక గుర్తింపు కార్డు తీసుకొని వచ్చి పోలింగ్ కేంద్రంలో తమ ఓటు హక్కును వినియోగించుకో వాలని కలెక్టర్ సూచించారు. మనం వేసే ఓటే మన భవిష్యత్తును నిర్దేశిస్తుందని, ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య ఎన్నికలో మనమంతా భాగస్వామ్యం కావాలని, ప్రతి ఒక్క ఓటరు ఓటు వేయాలని ప్రజాస్వామ్యాన్ని సంరక్షించాలని కలెక్టర్ పిలుపునిచ్చారు.

## రెంటాలలో ఘర్షణ

**పల్నాడు** పల్నాడు జిల్లా రెంటచింతల మండలం రెంటాల గ్రామంలో తెలుగుదేశం పార్టీ కి చెందిన ఇద్దరు ఏజెంట్లు మరో ఇద్దరు తెలుగుదేశం కార్యకర్తల తలలు వైసీపీ నాయకులు పగలకొట్టారు. సంఘటన స్థలానికి అదనపు బలగాలను దింపాలని ఈ సి ఆదేశించింది.

## ఎస్పై అత్యుత్సాహం లాఠీ ఛార్జ్, వృద్ధ మహిళ తలకు తీవ్ర గాయాలు

**తిరుపతి** సోళ్ళూరుపేట నియోజకవర్గ వర్గం నాయుడుపేట మండలం అన్నమేడు గ్రామంలో టిడిపి వైసిపి వర్గాలు ఒకరినొకరు తోపులాట చేసుకుని ఘర్షణ తలెత్తే పరిస్థితులు నెలకొడంతో అక్కడే విధుల్లో ఉన్న ఎస్పై గోపీనాథ్ వారిపై లాఠీ ఛార్జ్ చేశారు, ఇదే సమయంలో వృద్ధ మహిళ అని కూడా చూడకుండా ఇంటి బయట కూర్చుని వున్న 70 సంవత్సరాల జాబ జులేఖాభి అనే వృద్ధురాలి తల పై కూడా లాఠీ తో కొట్టడం తో ఆమె తలకు బలమైన గాయమైంది,దీంతో వృద్ధురాలిని వెంటనే ఆసుపత్రికి చేర్పించి చికిత్స అందిస్తున్నారు, ఎస్పై గోపీనాథ్ వృద్ధు రాలి పట్ల వ్యవహరించిన తీరుపై తీవ్ర విమర్శలు వస్తున్నాయి....

## మంత్రి అంబటి రాంబాబు అల్లుడు కారుపై దాడి

పల్నాడు జిల్లాలో మంత్రి అంబటి రాంబాబు అల్లుడు కారుపై టీడీపీ వర్గీయులు దాడికి దిగారు. ముప్పాళ్ళ మండలం నార్నెపాడులో పోలింగ్ ను పరిశీలించడానికి వెళ్లిన అంబటి అల్లుడు ఉపేష్ కారు పై దాడి చేశారు. ఈ దాడిలో ఆయన కారు అద్దాలు ధ్వంసం అయ్యాయి. ఇక, ఈ ఘటనపై మంత్రి అంబటి రాంబాబు సత్తెనపల్లిలో మీడియాతో మాట్లాడుతూ.. ముప్పాళ్ళ మండలం నార్నెపాడు గ్రామంలో టీడీపీ కార్యకర్తలు దౌర్జన్యానికి దిగారు అంటూ మండిపడ్డారు. ఓడిపోతామని నిరాశతో టీడీపీ నాయకులు దాడులకు తెగబడుతున్నారు.. గ్రామాల్లో కూడా వైసీపీ కార్యకర్తలపై రాళ్ల దాడికి పాల్పడ్డారు అని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఓట్లను బూతుల్లో ఉండి వాళ్లే వేసుకుంటున్నారు.. దీనిపై ఎన్నికల అధికారులకు తెలియజేశాం.. జరిగిన దాడిపై పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేస్తున్నాము.. ఇలాంటి దాడులను ఎట్టి పరిస్థితుల్లో సహించబోమని మంత్రి అంబటి రాంబాబు వెల్లడించారు...


## మంత్రి అంబటి రాంబాబు అల్లుడు కారుపై దాడి

**పల్నాడు** పల్నాడు జిల్లాలో మంత్రి అంబటి రాంబాబు అల్లుడు కారుపై టీడీపీ వర్గీయులు దాడికి దిగారు. ముప్పాళ్ళ మండలం నార్నెపాడులో పోలింగ్ ను పరిశీలించడానికి వెళ్లిన అంబటి అల్లుడు ఉపేష్ కారు పై దాడి చేశారు. ఈ దాడిలో ఆయన కారు అద్దాలు ధ్వంసం అయ్యాయి. ఇక, ఈ ఘటనపై మంత్రి అంబటి రాంబాబు సత్తెనపల్లిలో మీడియాతో మాట్లాడుతూ.. ముప్పాళ్ళ మండలం నార్నెపాడు గ్రామంలో టీడీపీ కార్యకర్తలు దౌర్జన్యానికి దిగారు అంటూ మండిపడ్డారు. ఓడిపోతామని నిరాశతో టీడీపీ నాయకులు దాడులకు తెగబడుతున్నారు. గ్రామాల్లో కూడా వైసీపీ కార్యకర్తలపై రాళ్ల దాడికి పాల్పడ్డారు అని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఓట్లను బూతుల్లో ఉండి వాళ్లే వేసుకుంటున్నారు.. దీనిపై ఎన్నికల అధికారులకు తెలియజేశాం.. జరిగిన దాడిపై పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేస్తున్నాము.. ఇలాంటి దాడులను ఎట్టి పరిస్థితుల్లో సహించబోమని మంత్రి అంబటి రాంబాబు వెల్లడించారు...


## పోలింగ్ కేంద్రాలను సందర్శించి ఓటింగ్ ప్రక్రియను పరిశీలించిన జిల్లా ఎస్పీ

**మచిలీపట్నం** జిల్లావ్యాప్తంగా అన్నిచోట్ల పోలింగ్ ప్రక్రియ ప్రారంభమైంది. పోలింగ్ కేంద్రాల వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు ఆస్కారం లేకుండా ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు సజావుగా జరిగేందుకు పోలింగ్ కేంద్రాల వద్ద పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. అందులో భాగంగా ఈరోజు జరిగే పోలింగ్ ప్రక్రియను జిల్లా ఎస్పీ శ్రీ అద్నాన్ నయీం అస్మి ఐపీఎస్ గారు అక్కడ ఏర్పాట్లను బందోబస్తును పరిశీలించారు. ఓటర్లు గుంపులుగా ఉండకుండా ఒక క్యూ పద్ధతి ద్వారా ఓటు హక్కు వినియోగించుకునేలా చూడాలని, చుట్టుపక్కల జనం గుమి గూడకుండా చర్యలు చేపట్టాలని అక్కడ పోలీస్ అధికారులకు తెలియజేశారు.

## నాగవళి నాందేడ్ సూపర్ పాస్ట్ స్పెషల్ ట్రైన్లో విశాఖ ఓటర్లు

**- ఓటు వేసేందుకు స్పెషల్ ట్రైన్లో వస్తున్న ఓటర్లు**

**విశాఖపట్నం** విశాఖ ఓటర్లు వస్తున్న నాగవళి నాందేడ్ స్పెషల్ ట్రైన్ ఆలస్యంగా రావడం వారిలో ఆందోళన కలిగించింది. ఉదయం 6 చేరాల్సిన ట్రైన్ సుమారుగా 5 గంటలు ఆలస్యంగా నడుస్తోంది. ప్రతి చోట టెక్నికల్ సమస్య అంటూ నిలిపివేస్తున్నారు. అధికారులు సమాధానం చెప్పడం లేదు. తమ ఓటు వృధా అవుతుందని ఆవేదన, అధికారులు పట్టించుకుని, సకాలం గమ్యాన్ని చేర్చాలని, లేదంటే ప్రత్యామ్నాయ ఏర్పాటు చేయాలని వీడియో సందేశం ద్వారా వినతి చేస్తున్నారు.

## 38 కేసులు, స్ట్రాంగ్ రూంలకు ఈవీఎంలు

తరలించి భద్రపరచనున్నారు. పోలింగ్ శాతం ఎంత నమోదు అవుతుందో ఇప్పుడే చెప్పలేం. అర్ధరాత్రి లేక మంగళవారం మధ్యాహ్నం పోలింగ్ శాతంపై క్లారిటీ వస్తుంది. గతంలోలాగే హైదరాబాద్ లో ఈ ఎన్నికల్లోనూ అతి తక్కువ శాతం పోలింగ్ నమోదైనట్లు' పేర్కొన్నారు.ఎన్నికల షెడ్యూల్ వచ్చినప్పటి నుంచి రూ.330 కోట్లు సొత్తు స్వాధీనం చేసుకున్నట్లుగా వికాస్రాజ్తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 14 వందల కేంద్రాల్లో పోలింగ్ కొనసాగిందని వెల్లడించారు. రాష్ట్ర వ్యాప్తంగా 44 స్ట్రాంగ్ రూంలు ఏర్పాట్లు చేసినట్లుగా తెలిపారు. భారీ బందోబస్తు మధ్య ఈవీఎంలు తెల్లవారుజాము వరకు స్ట్రాంగ్ రూమ్లకు చేరతాయని తెలిపారు. ఖచ్చితమైన పోలింగ్ శాతం నేడు మధ్యాహ్నం వరకు తెలుస్తుందన్నారు. పోలింగ్పై మంగళవారం స్క్రూటినీ ఉంటుందని, ఎక్కడైనా రీ-పోలింగ్ అవసరమైతే నేడు తెలుస్తుందని వెల్లడించారు.

## రాష్ట్రంలో పోలింగ్ శాతం పెరిగింది

పోలీసులు చర్యలు తీసుకున్నారని స్పష్టం చేశారు. మాచర్ల కేంద్రంలో ఈవీఎంలు దెబ్బతిన్నాయని, ఇంజినీర్లు యంత్రాలు పరిశీలించి డేటా భద్రంగా ఉందని చెప్పారని వివరించారు. మాచర్లలో 8 పోలింగ్ కేంద్రాల్లో ఓటింగ్ యంత్రాలు మార్చి మళ్లీ పోలింగ్ నిర్వహించామని ముఖేశ్ కుమార్ మీనా వెల్లడించారు. కోడూరులో రెండు చోట్ల, దర్శిలో రెండు చోట్ల ఈవీఎంలు దెబ్బతిన్నాయని వివరించారు. రీపోలింగ్ కు సంబంధించి ఎలాంటి ఫిర్యాదులు రాలేదని అన్నారు. పోలింగ్ సందర్భంగా వచ్చిన ఫిర్యాదులపై నేడు ఎన్నికల పర్యవేక్షకులు, ఆర్వోలు అన్ని పార్టీల అభ్యర్థులతో సమావేశమై చర్చిస్తారని ఏపీ సీఈవో ముఖేశ్ కుమార్ మీనా వెల్లడించారు. పల్నాడు జిల్లా తంగెడలో ప్రస్తుతం పరిస్థితి అదుపులోనే ఉందని, అక్కడ దాడికి ఉపయోగించింది పెట్రోల్ బాంబు అని వివరించారు. రాష్ట్రంలో ఎక్కడా ఉద్దేశపూర్వకంగా పోలింగ్ జాప్యం జరగడానికి అవకాశం లేదని, తాము ప్రతి అంశాన్ని మానిటరింగ్ చేస్తామని, ఒకవేళ పోలింగ్ ఆలస్యం కావడానికి సాంకేతిక అంశాలు కానీ, మరేదైనా ఇతర కారణం ఉండొచ్చని మీనా అభిప్రాయపడ్డారు. రాత్రి 10 గంటల కల్లా క్యూలో ఉన్న వారి ఓటింగ్ కూడా పూర్తయితే పోలింగ్ శాతం 80-85 శాతం దాటొచ్చని అంచనా. దీంతో గత ఎన్నికల కంటే ఎక్కువగానే పోలింగ్ జరిగినట్లు తెలుస్తోంది. ఇలా నమోదైన ఎక్కువ ఓటింగ్ ఏ రాజకీయ పార్టీని ముంచుతుందో, ఇంకెవరిని తేలుస్తుందో జూన్ 4న తేలనుంది.

## బుర్ఖా వివాదంలో మాధవీ లతకు షాక్

మీడియాలో విపరీతంగా వైరల్ అయ్యాయి. ఇది వివాదాస్పదం కావడంతో పోలీసులు మాధవీ లతపై కేసు నమోదు చేశారు. ఈ వ్యవహారంపై మాధవీ లత మాట్లాడుతూ "నేను ఒక అభ్యర్థిని. చట్ట ప్రకారం ఓటర్ల ఐడీ కార్డులు, ముఖాన్ని గుర్తించే అధికారం అభ్యర్థులకు ఉంటుంది. నేను పురుషుడ్ని కాను, దయార్ద్ర హృదయం ఉన్న ఓ మహిళను. హిజాబ్ వేసుకున్న మహిళల వద్దకు వెళ్లి నేను వారి ముఖాన్ని చూపించాలని నేను కోరుతున్నారు. ఆధార్ కార్డులు, ఓటర్ ఐడీ కార్డులు చెక్ చేస్తున్నారు. దీన్ని ఎవరైనా పెద్ద ఇష్యూ చేయాలనుకుంటే వారు భయపడుతున్నట్లే లెక్క" అని మాధవీ లత మాట్లాడారు. బీజేపీ ఎమ్మెల్యే రాజాసింగ్పై కూడా కేసు నమోదైంది. ప్రిసైడింగ్ అధికారితో దురుసుగా ప్రవర్తించడంతో మంగళ్ హాట్ పోలీస్ స్టేషన్లో గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్పై కేసు నమోదు చేశారు.

## ఓటరుపై చేయి చేసుకున్న వైసీపీ ఎమ్మెల్యే

నా కుటుంబానికి హాని కలిగే అవకాశం ఉందన్న సుధాకర్ పోలీసులే తమను రక్షించాలని కోరారు. మరోవైపు ఓటరు తనను, తనభార్యను దూషించడంతోనే కొట్టినట్లు ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ చెప్తున్నారు. మద్యం మత్తులో దురుసుగా ప్రవర్తించడంతోనే చేయిచేసుకున్నట్లు వివరణ ఇచ్చారు. అయితే సోషల్ మీడియాలో వైరల్ అయిన ఈ ఘటనపై ఎన్నికల సంఘం సీరియస్ అయ్యింది. అన్నాబత్తుని శివకుమార్ను అదుపులోకి తీసుకోవాలని ఎన్నికల సంఘం పోలీసులను ఆదేశించింది. పోలింగ్ పూర్తయ్యే వరకు ఆయనను నిర్బంధంలోనే ఉంచుకోవాలని ఆదేశించింది.

## అలాగైతే పాకిస్థాన్ కు గాజులు తొడిగిస్తాం

సెటైర్లు వేశారు. ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోయిన పాక్ వద్ద గాజులు కూడా ఉన్నాయో లేవో అంటూ చురకలు అంటించారు. ఫరూక్ అబ్దుల్లా పేరు ప్రస్తావించకుండానే ఇలా వ్యంగ్యాస్త్రాలు సంధించారు మోదీ. ఇదే సమయంలో పాక్లోని ఆర్థిక పరిస్థితులపైనా సెటైర్లు వేశారు. కాంగ్రెస్ సీనియర్ నేత మణిశంకర్ అయ్యర్ పాక్ ఆక్రమిత కశ్మీర్ చేసిన వ్యాఖ్యలు ఇటీవల వైరల్ అయ్యాయి. పాత వీడియో అయినప్పటికీ ఇప్పుడు వైరల్ అవడం వల్ల కాంగ్రెస్కి గట్టిగా షాక్ తగిలింది. ఆయన వ్యాఖ్యలతో తమకు సంబంధం లేదని పార్టీ తేల్చిచెప్పింది. కానీ అప్పటికే బీజేపీ దాడులు మొదలు పెట్టింది. కాంగ్రెస్ దేశ పౌరుల్ని భయపెడుతోందని, ఈ వైఖరే సీమాంతర ఉగ్రవాదాన్ని పెంచి పోషించిందని మండి పడ్డారు. పాకిస్థాన్ వద్ద అణు బాంబులున్నాయని బెదిరిస్తున్నారని, వాళ్లకు ఆ బాంబులను ఏం చేసుకోవాలో అర్థం కావడం లేదని సెటైర్లు వేశారు. అప్పుల్లో కూరుకుపోయిన పాకిస్థాన్ ఆ బాంబులు అమ్ముకునైనా డబ్బు సంపాదించాలని అనుకుంటోందని, కానీ వాటి నాణ్యత సరిగ్గా లేకపోవడం వల్ల ఎవరూ కొనడం లేదని అన్నారు.

## ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి చారిత్రాత్మక దినం

వినియోగించుకున్నారు. గతంలో కంటే ఎక్కువగా ఓటింగ్ శాతం నమోదు కావడంతో అన్ని పార్టీల నాయకుల్లో ఆశలు చిగురిస్తున్నాయి. ఓటింగ్ సమయం పూర్తి అయ్యే సమయానికి కూడా కొన్ని పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లు భారీగా క్యూలైన్లలో నిలబడి ఉన్నారు. సాయంత్రం 6 గంటలలోపు పోలింగ్ కేంద్రంలోని క్యూలైన్లలో ఉన్న ఓటర్లకు ఎన్నికల అధికారులు ప్రత్యేకంగా స్లిప్ లు ఇచ్చి వారు ఓటు వేసేందుకు అవకాశం కల్పించారు. సాయంత్రం ఆరు గంటల తరువాత పోలింగ్ కేంద్రాలకు వెళ్లి ఓటు వెయ్యడానికి ప్రయత్నించిన ఓటర్లకు ఎన్నికల అధికారులు అవకాశం ఇవ్వలేదు. ఎండ వేడమిని లెక్క చెయ్యకుండా, దాడులకు భయపడకుండా ఓటు వెయ్యడానికి ప్రజలు వచ్చారని, ఓటర్లలో చైతన్యం వెల్లివిరిసిందని, ప్రజల ఉత్సాహం చూస్తుంటే తనకు చాలా సంతోషంగా ఉందని, ఆంధ్రప్రదేశ్ ప్రజల్లో ఎన్నడూ లేని విధంగా చైతన్యం రావడంతో ప్రజలు మార్పు కోరుకుంటున్నారని అర్థం అవుతోందని మాజీ ముఖ్యమంత్రి, తెలుగుదేశం పార్టీ అధినేత నారా చంద్రబాబు నాయకుడు అన్నారు.ఆంధ్రప్రదేశ్ లోని పలు నియోజక వర్గాల్లో వైసీపీ నాయకులు, కార్యకర్తలు ఓటర్ల మీద, సామాన్య ప్రజల మీద దాడులు చేశారని, ఇలాంటి సంఘటనలు టీవీల్లో చూసిన ప్రజలు రగిలిపోయి పోలింగ్ కేంద్రాలకు వెళ్లి వైసీపీకి వ్యతిరేకంగా ఓటు వెయ్యాలని నిర్ణయించుకున్నారని మాజీ సీఎం చంద్రబాబు ఆరోపించారు. వైసీపీ అరాచకాలకు ఓటుతో ప్రజలు తగినగుణపాఠం చెబుతున్నారని చంద్రబాబు ఆరోపించారు. పలు ప్రాంతాల్లో వైసీపీ నాయకుల తీరుతో విసిగిపోయిన ప్రజలు వారి మీద తిరగబడ్డారని, ఇలాంటి సంఘటనలు చూస్తే ఆంధ్రప్రదేశ్ ప్రజలు కచ్చితంగా మార్పు కోరుకుంటున్నారని అర్థం అవుతోందని మాజీ సీఎం చంద్రబాబు నాయుడు అన్నారు. వైసీపీ అరాచకాలను ఎదిరించడానికి ఇంతకాలం వేచి చూసిన ప్రజలు ఈరోజు ఎంతో ధైర్యంగా ఓటు వేశారని, ఓటు వేసిన ఆంధ్రప్రదేశ్ ప్రజలకు పేరుపేరునా ధన్యవాదాలు చెబుతున్నానని నారా చంద్రబాబు నాయుడు తెలిపారు.

## కేసీఆర్ కేఏ పాల్లా మాట్లాడుతున్నారు

నిండుతాయని ఏజ్ లిమిట్ అమలు చేస్తే ఎవరు ప్రధాని అనేది బీజేపీ తేల్చుకోవాలన్నారు. దేశంలో ఇండియా కూటమి ప్రభుత్వం ఏర్పాటు చేయడం ఖాయమని సీఎం రేవంత్ రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. మ్యాజిక్ ఫిగర్ రాకపోతే బీజేపీ, ఎన్డీఏకు దేశంలో మద్దతు ఇవ్వడానికి ఎవరూ సిద్ధంగా లేరని తెలిపారు. బీజేపీ 336 సీట్లలో మాత్రమే పోటీ చేస్తోందని అలాంటప్పుడు 400 సీట్లు ఎట్లా సాధ్యమని ప్రశ్నించారు. 13 ఏళ్లు సీఎంగా 10 ఏళ్లు పీఎంగా పని చేసిన మోదీ రాజ్యాంగాన్ని పూర్తిగా అర్థం చేసుకోలేదన్నారు. దేశంలో మతపరమైన రిజర్వేషన్లు లేవని సామాజికంగా వెనుకబడిన వారికి మాత్రమే రిజర్వేషన్లు అమలులో ఉన్నాయన్నారు.ముస్లిం రిజర్వేషన్లు రద్దు చేస్తామని ఏపీలో ఎన్డీఏ కూటమి ఎందుకు చెప్పడంలేదని రేవంత్ రెడ్డి ప్రశ్నించారు. దేశ ప్రజలకు మోదీ మాయమాటలు చెబుతున్నారన్నారని దుయ్యబట్టారు. ఇండియా కూటమి పేరుతో తాము ప్రజలను ఓట్లు అడుగుతోంటే మోదీ పేరుతో బీజేపీ ఓట్లు అడుగుతోందన్నారు. ఎవరు నామ్ దార్, ఎవరు కామ్ దార్ దీన్నిబట్టి తెలుస్తోందన్నారు. ఎవరు అట్టడుగు వర్గాల ప్రజల కోసం పని చేస్తున్నారో చర్చకు సిద్ధమన్నారు. దేశంలో మోదీ వ్యతిరేక వేవ్ నడుస్తోందన్నారు. నరేంద్ర మోదీ రాజ్యాంగానికి వ్యతిరేకంగా మాట్లాడినా చర్యలు లేవని నవనీత్ కౌర్ 15సెకన్ల కామెంట్స్పై చర్యలు లేవని రేవంత్ రెడ్డి మండిపడ్డారు. బీజేపీ నేతలపై ఎంహెచ్ఏ కంప్లైంట్ చేయదు కానీ ఒక వీడియో వైరల్ కేసులో తమపై చర్యలకు సిద్ధమైందన్నారు. ఏజెన్సీలను బీజేపీ దుర్వినియోగం చేస్తుందనడానికి ఇది నిదర్శనమన్నారు

. బీజేపీ వాషింగ్ మెషిన్లో చేరగానే కొందరు నాయకుల అవినీతి మరకలు తొలగిపోయాయా అని ప్రశ్నించారు.కాంగ్రెస్ పార్టీకి అదానీ, అంబానీ డబ్బులు ఇస్తున్నారని మోదీ ఆరోపిస్తున్నారని గుర్తు చేసి రేవంత్ రెడ్డి ఈడీ, సీబీఐ, ఐటీ అధికారులను పంపి ఆదానీ, అంబానీల ఆఫీసులపై, ఇళ్లల్లో సోదాలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. మోదీ ఆరోపణలు నిజమైతే ఎందుకు వారిపై చర్యలు తీసుకోవడం లేదన్నారు. రైతు బంధు ఎలా ఇచ్చామో పంద్రాగస్టులోగా రైతు రుణమాఫీ చేసి తీరుతామని రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. రుణమాఫీ ఏమీ అసాధ్యమైన టాస్క్ కాదన్నారు. పార్లమెంట్ ఎన్నికలు తమ వంద రోజుల పాలనకు రెఫరెండమని మరోసారి ఉద్ఘాటించారు. రాష్ట్రంలో శాంతిభద్రతలను దెబ్బతీసి పెట్టుబడులు గుజరాత్కు తరలించుకుపోవాలని బీజేపీ కుట్ర చేస్తోందన్నారు. యూపీ పరిస్థితిని తెలంగాణలో తీసుకురావాలని ప్రయత్నిస్తోందని రేవంత్ రెడ్డి ఆరోపించారు.

## ఇక త్వరగా పెళ్లి చేసుకోక తప్పేలా లేదు

గతేడాది జైపూర్ మహారాణి కాలేజీ విద్యార్థులతో రాహుల్ గాంధీ ముచ్చటించారు. ఈ సమయంలో ఆయన పెళ్లి గురించి ఓ విద్యార్థిని ప్రశ్నించింది. 'మీరు అందంగా ఉంటారు చూడటానికి చాలా బాగుంటారు, అయినా మీరు ఎందుకు పెళ్లి చేసుకోలేదు ' అని అడిగింది. దీనికి రాహుల్ బదులిస్తూ తన పనులు, పార్టీ వ్యవహారాల్లో పూర్తిగా నిమగ్నమైనందునే పెళ్లి వైపు ఆలోచన వెళ్లలేదని వెల్లడించారు.అలాగే, ఓ ఇటాలియన్ పత్రికకు ఇచ్చిన ఇంటర్వ్యూలోనూ వివాహం, పిల్లల గురించి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. తాను ఇప్పటి వరకు పెళ్లి ఎందుకు చేసుకోలేదో తెలియదన్న ఆయన.. పిల్లలు మాత్రం కావాలని ఉందని చెప్పారు, ఇప్పటి వరకూ పెళ్లి ఎందుకు చేసుకోలేదన విషయం తనకే విచిత్రంగా ఉంటుందని పేర్కొన్నారు. చాలా పనులు చేయాల్సి ఉందన్న రాహుల్ తనకు పిల్లలు కావాలని ఉందని పేర్కొన్నారు. కేరళలోని వాయనాడ్తో పాటు ఉత్తర్ ప్రదేశ్లోని రాయబరేలీ నుంచి రాహుల్ గాంధీ పోటీచేస్తున్న విషయం తెలిసిందే. రాయబరేలీ నుంచి ప్రాతినిధ్యం వహిస్తోన్న సోనియా గాంధీ రాజ్యసభకు వెళ్లడంతో కాంగ్రెస్ కంచుకోటగా గుర్తింపు పొందిన ఈ స్థానంలో రాహుల్ గాంధీ బరిలో నిలిచారు. అమేథీలో 2004 నుంచి వరుసగా మూడుసార్లు విజయం సాధించిన ఆయన.. 2019 ఎన్నికల్లో కేంద్ర మంత్రి స్మృతి ఇరానీ చేతిలో ఓటమి చవిచూశారు.

## బ్యాక్ టూ హైదరాబాద్

తిరిగివస్తున్న హైదరాబాద్ బాట పట్టారు. ఆఫీసులు, పనులు, వ్యాపారాలు ఉండటంతో సొంతూళ్లకు వెళ్లిన వారు ఒకేసారి తిరుగు ప్రయాణం కావడంతో విజయవాడ - హైదరాబాద్ జాతీయ రహదారిపై భారీగా ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. కాగా శనివారం, ఆదివారం హైదరాబాద్ నుంచి విజయవాడకు వాహనాలు క్యూ కట్టగా రహదారి కిక్కిరిసిపోయిన కిలోమీటర్ల మేర భారీ ట్రాఫిక్ జామ్ కావడం తెలిసిందే. తాజాగా సైతం అదే పరిస్థితి కనిపిస్తోంది. దాంతో పంతంగి టోల్ ప్లాజా వద్ద వాహనాలు నెమ్మదిగా కదిలాయి.

## తెలంగాణ ప్రజలు బీజేపీకి ఫేవర్

కార్యకర్తలే కాకుండా ఎమ్మెల్యేలు సైతం నమ్మలేదని ఎద్దేవా చేశారు. సోమవారం జరిగిన పోలింగ్తో తెలంగాణలో బీజేపీ కొత్తశక్తిగా నిలుస్తుందనడంలో సందేహం లేదని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి అన్నారు. రాష్ట్ర అభివృద్ధికి నడ్డా నాయకత్వంలో సంపూర్ణ సహకారం లభించిందని చెప్పారు. రాష్ట్రంలో మెజార్టీ ఓటర్లు బీజేపీకే మొగ్గు చూపారని, తాము ఆశించినట్లుగానే ఆ పార్టీకి రెండంకెల సీట్లు వస్తాయని కిషన్రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రజలను రెచ్చగొట్టే ప్రయత్నం చేసిందని కిషన్ రెడ్డి మండిపడ్డారు. అయినా సీఎం రేవంత్, రాహుల్గాంధీ మాటలను ప్రజలు నమ్మలేదన్నారు. ఆ పార్టీ కార్యకర్తలే వీరి మాటలను సీరియస్గా తీసుకోలేదన్నారు. ఏ పార్టీవారైనా సరే ప్రధానిగా మోడీ ఉండాలని ప్రజలు భావించారని చెప్పారు. పట్టణప్రాంత వాసులే కాదని, ఈసారి పల్లెల్లోనూ బీజేపీకు ఓట్లు బాగా పెరిగాయన్నారు. చాలా మంది ఓటర్లు మోడీకే ఓటు వేస్తున్నామని పోలింగ్ కేంద్రాల వద్ద బహిరంగంగా చెప్పారని కిషన్రెడ్డి తెలిపారు. రాష్ట్రంతో పాటు హైదరాబాద్లోనూ కొంత పోలింగ్ శాతం తగ్గిందని, అయినా బీజేపీకి సానుకూలంగా ఓట్లు పడ్డాయన్నారు. ఎక్కువ మంది ఏపీ ప్రజలు ఓట్ల కోసం అక్కడికి వెళ్లిపోయారని, అందుకే హైదరాబాద్లో ఓటింగ్ శాతం తగ్గిందని వివరించారు. హైదరాబాద్లో సెలబ్రిటీలు కూడా క్యూలో నిలబడి ఓటేశారని, వారు లైన్లో నిలబడి ఓటేయడం మంచి సందేశమని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి అభినందించారు. అన్నివర్గాల ప్రజలు స్వచ్ఛందంగా ముందుకొచ్చి ఓటేశారని, ప్రశాంతంగా జరిగిన ఎన్నికలు రానున్న రోజుల్లో ప్రజాస్వామ్యం బలపడటానికి ఉపయోగపడుతుందని అభిప్రాయపడ్డారు. 2019 పార్లమెంటు ఎన్నికల్లో 62.7 శాతం జరిగిందని, ఈసారి ఇది 65 శాతం దాటుతుందని అంచనా వేశారు.

## ముంబైలో గాలివాన బీభత్సం

ముంబై (ప్రశ్న న్యూస్) దేశ ఆర్థిక రాజధాని ముంబయి నగరంలో గాలి దుమారం బీభత్సం సృష్టించింది. దుమ్ము దుమారం, భారీ వర్షంతో ప్రజలు తీవ్ర భయాందోళనలకు గురయ్యారు. మధ్యాహ్నం 3 గంటల సమయంలో వాతావరణం ఒక్కసారిగా మారిపోయి చిమ్మ చీకట్లు కమ్మేశాయి. గాలి దుమారం చెలరేగి ఈదురుగాలులకు ఘట్కోపర్లో 100 అడుగుల ఎత్తైన బిల్బోర్డ్ కుప్పకూలింది. ఈ ఘటనలో చాలా మందికి గాయాలయ్యాయని అధికారులు తెలిపారు. ఈ సీజన్లో ముంబయిలో కురిసిన మొదటి వర్షం ఇదే. ఘట్కోపర్, బాంద్రా-కుర్లా, ధారవి ప్రాంతంలో బలమైన గాలులతో కూడిన వర్షం కురిసింది. దీంతో పలు ప్రాంతాల్లో ట్రాఫిక్ స్తంభించిపోయింది. ముంబయి విమానాశ్రయంలో విమానాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. రెండు గంటల పాటు విమానాలు నిలిచిపోయాయి. సాయంత్రం 5.30 గంటల తర్వాత విమాన సర్వీసులు ప్రారంభించింది. 13 విమానాలను దారి మళ్లించింది. గతవారమే ప్రీ-మాన్సూన్ రన్వే నిర్వహణ పనులను ముంబయి ఎయిర్పోర్ట్ విజయవంతంగా పూర్తిచేసింది. ఘట్కోపర్ చెద్దానగర్ జంక్షన్ వద్ద 100 అడుగుల ఎత్తైన బిల్బోర్డ్ కూలి పెట్రోల్ బంకుపై పడింది. ఈ ఘటనలో 59 మంది వరకూ గాయపడ్డారు. వీరిలో ఇప్పటి వరకూ 8 మంది చనిపోయినట్టు తెలిపారు. ప్రాణనష్టం గురించి మరింత సమాచారం అందాల్సి ఉంది. అంధేరి ఈస్ట్, ఆరే స్టేషన్ల మధ్య మెట్రో రైలు సర్వీసులు నిలిచిపోయాయి. ఈదరుగాలులకు హైటెన్షన్ వైర్లు తెగిపడటంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. దీంతో రైలు సర్వీసులను రద్దుచేసినట్టు ముంబయి మెట్రో రైల్వే అధికార ప్రతినిధి తెలిపారు. అలాగే, థానే ములంద్ మధ్య లోకల్ రైలు సర్వీసులను కూడా నిలిపివేసినట్టు అధికారులు తెలిపారు నవీ ముంబయిలోని పలుచోట్ల చెట్లు కూలిపోయాయి. మరోవైపు వచ్చే 3-4 గంటల్లో పాల్ఘర్, థానే జిల్లాల్లోని పలు ప్రాంతాల్లో గంటకు 50-60 కి.మీ వేగంతో ఈదురుగాలులు, ఉరుములు, మెరుపులతో కూడిన మోస్తరు నుంచి భారీ వర్షం కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ విభాగం ఓ ప్రకటనలో తెలిపింది.

## ఓటింగ్ను బహిష్కరించిన తండావాసులు

**- ప్రత్యేక గ్రామపంచాయతీకి నాలుగు కిలోమీటర్ల దూరంలో పోలింగ్ బూత్**

**- అధికారుల చొరవతో శాంతించిన తండావాసులు**



**కొత్తూరు (ప్రశ్న న్యూస్)** కొత్తూర్ మండల పరిధిలోని కోడిచర్ల ప్రత్యేక గ్రామపంచాయతీ తండావాసులు ఓటు వేయడానికి నిరాకరించారు. గ్రామపంచాయతీ ఏర్పాటు చేసినా కూడా తమ తండాకు పోలింగ్ బూత్ ఏర్పాటు చేయలేదని నిరసిస్తూ రోడ్డు పై ధర్నాకు బైఠాయించారు. తాండవాసులు తమ యొక్క ఓటు హక్కును వినియోగించుకోవాలి అంటే నాలుగు కిలోమీటర్లు నడిచి వెళ్లాలని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో పలు మార్లు ప్రజా ప్రతినిధులు, అధికారుల దృష్టికి తీసుకెళ్లిన ప్రయోజనం లేదని అన్నారు. సమాచారం తెలుసుకున్న అధికారులు రోడ్డుపై ధర్నా చేస్తున్న తండావాసులకు భవిష్యత్తులో రాబోయే ఎలక్షన్లలో పోలింగ్ బూత్ ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. అధికారుల చొరవతో ధర్నా విరమించి ఓటు హక్కును వినియోగించుకోవడానికి పోలింగ్ కేంద్రానికి బయలుదేరి వెళ్లారు.

## ఓటు వేసిన కొల్లు రవీంద్ర

**మచిలీపట్నం** మచిలీపట్నం నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి కొల్లు రవీంద్ర తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. సర్కిల్ పేటలోని మున్సిపల్ ఎలిమెంటరీ స్కూల్ లో ఏర్పాటు చేసిన 116 వ నెంబర్ పోలింగ్ బూత్ లో రవీంద్ర ఓటు వేశారు. రవీంద్ర తో పాటు ఆయన సతీమణి నీలిమ,కుమారుడు పునీత్ కూడా ఓటు హక్కు వినియోగించుకున్నారు.. ప్రజా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసుకునేందుకు ప్రతి ఒక్కరూ ఓటు వేయాలని రవీంద్ర పిలుపునిచ్చారు...

## ఓటు హక్కు వినియోగించుకున్న వొడితల ప్రణవ్

**హుజూరాబాద్** కరీంనగర్ పార్లమెంట్ ఎన్నికల పోలింగ్ సమయం రానే వచ్చేసింది.ఈ సందర్భంగా హుజురాబాద్ నియోజకవర్గంలోని ప్రధాన పార్టీ నాయకులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు.హుజురాబాద్ లో కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జ్ వొడితల ప్రణవ్ తన ఓటు హక్కును వినియోగించుకున్నారు.హుజురాబాద్ మండలము సింగపూర్ గ్రామంలో కుటుంబ సమేతంగా తన ఓటు హక్కును వినియోగించుకున్నారు.ఈ సందర్భంగా ప్రణవ్ మీడియాతో మాట్లాడుతూ వేసవి కాలం అధికంగా ఉండడం వలన ఓటర్లు తొందరగా పోలింగ్ బూత్ కేంద్రాలకు వచ్చి ఓటు వేయాలని,కొత్తగా వచ్చిన ఓటర్లు తమ యొక్క ఓటును భాద్యతగా వినియోగించుకోవాలని కోరారు.దేశ భవిష్యత్తును నిర్ణయించే ఎన్నిక కాబట్టి ప్రతి ఒక్కరూ తనవంతు బాధ్యతగా ఓటు వేసి ప్రజాస్వామ్యాన్ని కాపాడాలని కోరారు.

## దొంగ ఓట్ల కలకలం

**తిరుపతి** జగన్మాత చర్చి సమీపంలోని పోలింగ్ కేంద్రం వద్ద దొంగ ఓట్లు కలకలం రేపాయి. దొంగ ఓట్ల పోలింగ్ కు వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నేతల ప్రయత్నం చేసారు. దొంగ ఓట్లు వేసేందుకు వచ్చిన ఐదుగురిని ఎన్డీఏ కూటమి నేతలు పట్టుకున్నారు. దొంగ ఓటర్లను పోలీసులకు అప్పగించారు.

# రాక్షస రాజ్యానికి అంతం లేదా.?

**- తలుపులు మూసివేసి రిగ్గింగ్ అంటూ మాధవీలత ఆరోపణలు**

**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** తెలంగాణలో ఎన్నికలు ముగిసిన తరువాత ఎంఐఎం నేతలు రిగ్గింగ్ చేశారని హైదరాబాద్ బీజేపీ ఎంపీ అభ్యర్థి మాధవీ లత సంచలన ఆరోపణలు చేశారు. చంద్రాయణ్ గుట్టలోని రియాసత్ నగర్ బూత్ నంబర్ 40లో రిగ్గింగ్ జరిగిందని ఆమె ఆరోపించారు. ఆ సమయంలో ఒక్క అధికారి, పోలీసు కూడా అక్కడ లేరని పేర్కొన్నారు. హిజాబ్ ధరించి ఉన్న దాదాపు 150కి పైగా యువతులు, మహిళల్ని వేరే చోటు నుంచి తీసుకొచ్చి వారితో దొంగ ఓట్లు వేయిస్తున్నారని సమాచారం అందగానే అక్కడికి వెళ్లినట్లు తెలిపారు. అసదుద్దీన్ ఒవైసీ పదే పదే హిట్లర్ పేరు ప్రస్తావిస్తారు.. హిట్లర్ రాజ్యమంటే ఇలాగే ఉంటుందంటూ మండిపడ్డారు. బతికున్న ఎంతో మందిని చనిపోయారని చెబుతూ ఓటు వేయకుండా అడ్డుకున్నారని, రాక్షస రాజ్యానికి అంతం లేదా? అని ప్రశ్నించారు.

**- ఎంత పిలిచినా తలుపులు తెరవలేదు..**

తాను పోలింగ్ బూత్ కు వెళ్లగా రిగ్గింగ్ జరిగినట్లు గుర్తించానని, అక్కడ పోలీసులు, అధికారులు లేరని మాధవీ లత తెలిపారు. కిటికీల నుంచి వీడియోలు తీయగా రిగ్గింగ్ జరిగినట్లు, లోపల మనుషులు ఉన్నట్లు గుర్తించామన్నారు. తాను ఎక్కడికి వెళ్తే అక్కడికి ఎంఐఎం మనుషులు, పోలీసులు వస్తున్నారని సెక్యూరిటీగా బీజేపీ కార్యకర్తలు ఉంటే, వారిపై సైతం బెదిరింపులకు పాల్పడుతున్నారని మీడియాకు తెలిపారు. పోలీసులు సైతం వారికి మద్దతుగా నిలిచారని, గంటసేపు తాను అక్కడే ఉండగా అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి వచ్చి ఎంత సేపు డోర్ కొట్టినా, పిలిచినా లోపల నుంచి ఎవరూ స్పందించకపోవడం దారుణమన్నారు. ఎక్కడైనా పోలింగ్ బూత్ మీద ఇళ్లు ఉంటుందా, ఇక్కడ అందుకు భిన్నంగా ఉందని చెప్పారు. మొఘల్ పురాలో అసదుద్దీన్ ఒవైసీ సమక్షంలో 500 మంది కలిసి ర్యాలీ చేశారు. తన మీద ఇష్టం ఉన్నట్లు అరుస్తూ బండ బూతులు తిడుతూ దుర్మార్గంగా ప్రవర్తించినట్లు తెలిపారు. వెంటనే సీఆర్పీఎఫ్ సిబ్బంది స్పందించి తనను సేఫ్ గా కారులో తరలించారని చెప్పుకొచ్చారు. గోల్డెన్ జూబ్లీ స్కూళ్లో ఓ మైనర్ ను పట్టుకోగా, మైనర్ అని రాస్తామన్నారు. ఈరోజు హాలిడే అని రేపు



కేసు నమోదు చేస్తామని చెబుతున్నారని వాపోయారు. కొందరు పోలింగ్ బూత్ లో ఓటు వేసి బయటకు వచ్చాక, షర్ట్ మార్చుకుని వెళ్లి మరో ఓటు వేసి రావడం చూశామన్నారు.

**- ఇప్పుడు అసలైన పాదయాత్ర చేస్తా - మాధవీ లత**

ఇది ప్రజాస్వామ్యం కాదా, 21వ శతాబ్దంలో లేమా అని మాధవీ లత ప్రశ్నించారు. దొంగ ఓట్లు వేస్తున్నారని, మీరు చెక్ చేయండని చార్మినార్ ప్రాంతంలో లేడీ కానిస్టేబుల్ ను తాను అడగగా.. తమకు ఎలాంటి సూచనలు లేవని, తమకు సంబంధం లేదని చెప్పడాన్ని తప్పుపట్టారు. బురఖా తీసి చెక్ చేయాలని కోరగా, ప్రిసైడింగ్ ఆఫీసర్ కు తమ సహాయం కావాలని అడిగితే మాత్రమే చెక్ చేస్తామన్నారు. లేకపోతే అక్కడ రిగ్గింగ్ జరిగినా, దొంగ ఓట్లు వేసినా, దుర్మార్గం జరిగినా చూస్తు కూర్చుంటామన్నట్లు పోలీసులు వ్యవహరించారని మాధవీ లత ఆరోపించారు. ఇన్ని రోజులు తాను చేసింది పాదయాత్ర కాదని, ఓట్లు డిలిట్ అయిన వారి వివరాలు తీసుకుని ఇంటింటికి పాదయాత్ర చేసి చూపిస్తానన్నారు. ప్రతి బూత్ లో 150 నుంచి 200 హిందువుల ఓట్లు తొలగించారని, ఈ అన్యాయాలను చూస్తూ సహించేది లేదన్నారు. చనిపోయారని చెబుతూ బతికున్న హిందువుల ఓట్లను తొలగించారని సంచలన ఆరోపణలు చేశారు.



# డేట్లు ఖాళీ లేవంటున్న రష్మిక



కన్నడ సోయగం రష్మిక మందన్న తారాపథంలో దూసుకుపోతున్నది. తెలుగు, హిందీ, తమిళ భాషల్లో వరుసగా భారీ సినిమాలతో బిజీబిజీగా మారింది. మరో ఏడాది పాటు ఈ అమ్మడి డేట్స్ ఖాళీ లేవు అంటున్నారు. ప్రస్తుతం రష్మిక చేతిలో ఆరు సినిమాలున్నాయి. వీటి షూటింగ్స్ మొత్తం పూర్తి కావడానికి ఏడాదికిపైగా సమయం పడుతుందంటున్నారు. దాంతో ఈ భామ డేట్స్ కావాలంటే మరో ఏడాది పాటు ఆగాల్సిందే. ప్రస్తుతం రష్మిక మందన్న తెలుగులో పుష్ప-2, రెయిన్‌బో, గర్ల్‌ఫ్రెండ్, కుబేర చిత్రాల్లో నటిస్తున్నది. 'పుష్ప-2' చిత్రీకరణ తుదిదశకు చేరుకోగా..మిగిలిన మూడు చిత్రాలు షూటింగ్స్ జరుపుకుంటున్నాయి. ఇక బాలీవుడ్‌లో 'యానిమల్' బ్లాక్‌బస్టర్ విజయంతో ఈ సొగసరికి అవకాశాలు వెల్లువెత్తున్నాయి. 'సికిందర్' సినిమాలో సల్మాన్‌ఖాన్‌తో జోడీ కట్టబోతున్నది. విక్కీకౌశల్‌తో 'ఛావా' సినిమాలో నటిస్తున్నది. హిందీలో మరికొన్ని ఆఫర్లొచ్చినా..డేట్స్ ఖాళీలేని కారణంగా రష్మిక అంగీకరించలేదని అంటున్నారు. మొత్తంగా చూస్తే మరో ఏడాది పాటు రష్మిక మందన్న డేట్స్ దొరకడం కష్టమేనని ఫిల్మ్‌సర్కిల్స్‌లో వినిపిస్తున్నది.

# పిరయాడిక్ డ్రామాలకు పెరుగుతున్న ఆదరణ

## ఆ తరహా కథలతోముందుకు వస్తున్న హీరోలు

కొత్తదనం పంచే క్రమంలో మన కథానాయకులు పిరయాడిక్ సినిమాలకు ప్రాధాన్యం ఇస్తున్నారు. గత కాలానికి తీసుకెళ్లి వినోదాలను అందించే ప్రయత్నం చేస్తున్నారు. ఇప్పుడీ తరహా పీరియాడిక్ కథల జోరు తెలుగులో మరింత ఊపందుకుంది. పలువురు అగ్రతారలతో పాటు కుర్రహీరోలు ఈ కథలతోనే సినీ ప్రియుల్ని మురిపించేందుకు సమాయత్తమవుతున్నారు. ఈతరం ప్రేక్షకులు ఇలాంటి సినిమాలపై ఎక్కువ ఆసక్తి కనబరుస్తుండటంతో.. వారి అభిరుచుల్ని దృష్టిలో పెట్టుకునే ఆ తరహా కథలతో ప్రయాణించేందుకు ఆసక్తి చూపిస్తున్నారు.'బాహుబలి', 'ఆదిపురుష్' చిత్రాల కోసం చరిత్ర పుటలు తిరగేశారు కథానాయకుడు ప్రభాస్. ఇప్పుడాయన 'కల్కి 2898ఎ.డి' కోసం తీసుకెళ్లేందుకు సిద్ధమవుతున్నారు. దీని తర్వాత ఆయన చేయనున్న సినిమాల్లో హను రాఘవపూడి చిత్రం ఒకటుంది. ఇప్పుడీ చిత్రం కోసం మరోసారి గతంలోకి ప్రయాణించనున్నారు ప్రభాస్. ఇది చారిత్రక అంశాలతో నిండిన ఫిక్షనల్ పీరియాడిక్ లవ్-యాక్షన్ డ్రామాగా ఉండనున్నట్లు హను ఇప్పటికే స్పష్టత ఇచ్చారు. 'ఆర్ఆర్ఆర్' సినిమాతో అంతర్జాతీయ స్థాయిలో ఆదరణ దక్కించుకున్నారు కథానాయకుడు రామ్‌చరణ్. ఆయన త్వరలో బుచ్చిబాబు సాన దర్శకత్వంలో ఓ చిత్రం చేయనున్న సంగతి తెలిసిందే. ఇదీ పీరియాడిక్ టచ్‌తో ఉన్న స్పోర్ట్స్ డ్రామాగానే ఉండనున్నట్లు సమాచారం. పూర్తిగా ఉత్తరాంధ్ర నేపథ్యంలో సాగే ఈ సినిమా రా, రస్టిక్‌గా ఉండనున్నట్లు చిత్రబృందం ఇప్పటికే ప్రకటించింది. ఇటీవల కాలంలో నాని నుంచి వచ్చిన విజయవంతమైన చిత్రాల్లో 'దసరా' ఒకటి. శ్రీకాంత్ ఓదెల తెరకెక్కించిన ఈ పీరియాడిక్ యాక్షన్ డ్రామా బాక్సాఫీస్ ముందు భారీ వసూళ్లు కొల్లగొట్టింది. ఇప్పుడిదే కలయికలో మరో సినిమా రానుంది. ఇది నానికి 33వ చిత్రం. ఇదీ ఓ విభిన్నమైన పీరియాడిక్ యాక్షన్ కథాంశంతోనే ముస్తాబు కానుంది. దీంట్లో నాని ప్రజా నాయకుడి పాత్రలో కనిపించ నున్నట్లు వార్తలు వినిపిస్తున్నాయి. విజయ్ దేవరకొండ ప్రస్తుతం గౌతమ్ తిన్ననూరి దర్శకత్వంలో ఓ స్పై థ్రిల్లర్ సినిమా చేస్తున్న సంగతి తెలిసిందే. దీని తర్వాత ఆయన చేయనున్న సినిమాల్లో దర్శకుడు రాహుల్ సంకృత్యాన్ ప్రాజెక్ట్ ఒకటుంది. 1854 నుంచి 1978 మధ్య కాలంలో జరిగిన యథార్థ చారిత్రక సంఘటనల ఆధారంగా రూపొందుతున్న పాన్ ఇండియా చిత్రమిది. రాయలసీమ నేపథ్యంలో సాగే ఈ సినిమాలో విజయ్ ఓ వీరుడిగా కనిపించనున్నారు. 'విరూపాక్ష', 'బ్రో' సినిమాలతో వరుస విజయాలందుకుని జోరు మీదున్నారు సాయిదుర్గా తేజ్. ఇప్పుడాయన రాకేశ్ అనే కొత్త దర్శకుడితో ఓ చిత్రం చేసేందుకు సమాయత్త మవుతున్నారు. ఇది 1940ల నేపథ్యంలో సాగే ఓ విభిన్నమైన కథాంశంతో రూపొందనున్నట్లు తెలిసింది. ఇక మరో మెగా హీరో వరుణ్‌తేజ్ ప్రస్తుతం చేస్తున్న 'మట్కా' కూడా పీరియాడిక్ యాక్షన్ డ్రామా చిత్రమే. గతేడాది 'ఏజెంట్'తో చేదు ఫలితాన్ని అందుకున్నారు యువ హీరో అఖిల్ అక్కినేని. ఇప్పుడాయన తదుపరి సినిమాని కొత్త దర్శకుడు అనిల్‌తో పట్టాలెక్కించేందుకు సమాయత్తమవుతున్నారు. ఇదీ ఓ ఆసక్తికరమైన పీరియాడిక్ యాక్షన్ డ్రామాగానే ముస్తాబు కానున్నట్లు తెలిసింది. ఈనెలలోనే విష్వక్ సేన్ 'గ్యాంగ్స్ ఆఫ్ గోదావరి'తో, సుధీర్‌బాబు 'హరోం హర'తో, రాకేశ్ వర్రె 'జితేందర్ రెడ్డి'తో రాబోతున్నారు. ప్రస్తుతం ముగింపు దశ చిత్రీకరణలో ఉన్న పీరియాడిక్ సినిమాల్లో బాలకృష్ణ చిత్రం ఒకటుంది. బాబీ దర్శకత్వం వహిస్తున్న ఆ సినిమా 80ల నేపథ్యంతో ముడిపడి ఉన్న యాక్షన్ కథాంశంతోనే తెరకెక్కుతోంది. ఇక నిఖిల్ నటిస్తున్న 'స్వయంభూ' చారిత్రక కథాంశంతో ముడిపడి ఉన్న సినిమా కాగా.. 'ది ఇండియా హౌస్' స్వాతంత్ర్యానికి పూర్వం సాగే కథతో తెరకెక్కనుంది. శర్వానంద్ హీరోగా అభిలాష్ రెడ్డి రూపొందిస్తున్న స్పోర్ట్స్ డ్రామా కూడా పీరియాడిక్ టచ్ ఉన్న చిత్రమే కావడం విశేషం. ఇలా గతంలోకి తొంగిచూసేలా చిత్రాలు తెరకెక్కుతున్నాయి.

# డాక్టర్‌ను..యాక్టర్‌ను కావాలనుకున్నవే: శ్రీలీల



సినీ తారల్లో ఇదివరకు చాలామంది డాక్టర్ కాబోయి యాక్టర్ అయ్యానని చెప్పేవాళ్లు. నవతరం కథానాయిక శ్రీలీల మాత్రం డాక్టర్, యాక్టర్ ఈ రెండు వృత్తుల్నీ నాకు నేనుగానే ఎంచుకున్నా అంటోంది. మా ఇంటి వాతావరణం ప్రభావమో ఏమో... పాఠశాల రోజుల్లోనే పెద్దయ్యాక వైద్యురాల్ని కావాలని నాకు నేనుగా నిర్ణయం తీసేసుకున్నా. ఆ దిశగానే నా చదువులు సాగాయి. ఇక నటన అంటారా? నాకు చిన్నప్పట్నుంచీ నాట్యంలో ఉన్న ప్రవేశం నన్ను వేదికలెక్కించింది. ఆ ప్రతిభే నటనవైపూ తీసుకొచ్చింది. ఈ రెండు వృత్తుల ప్రయాణం వేర్వేరుగా అనిపించినా... రెండు కూడా ప్రజలతో ముడిపడినవే కదా. అందుకే రెండింటిపైనా నాకు ఒకే రకమైన ప్రేమ ఉంటుందని చెప్పుకొచ్చింది శ్రీలీల. రొమాంటిక్ ప్రేమకథలన్నా, పీరియాడిక్ కథలన్నా అమితమైన ప్రేమ అని, వాటిల్లో నటించే అవకాశం వస్తే అస్సలు వదులుకోనని చెప్పింది శ్రీలీల.

# డిస్నీలో రానున్న యక్షిణి వెబ్ సిరిస్




ఇప్పటికే డిఫరెంట్ ఇంట్రెస్టింగ్ వెబ్ సిరీస్ లతో ఓటీటీ అభిమానులకు ఫేవరేట్ గా మారింది డిస్నీ ప్లస్ హాట్ స్టార్. ఈ డిజిటల్ ప్లాట్ ఫామ్ త్వరలో యక్షిణిఅనే మరో ఇంట్రెస్టింగ్ వెబ్ సిరీస్ ను ప్రేక్షకుల ముందుకు తీసుకురాబోతోంది. ఈ వెబ్ సిరీస్ ను బాహుబలి ప్రొడక్షన్ హౌస్ 'ఆర్కా మీడియా వర్క్స్' పై శోభు యార్లగడ్డ, ప్రసాద్ దేవినేని నిర్మిస్తున్నారు. ఈ సిరీస్‌తోవేదిక, మంచు లక్ష్మి , రాహుల్ విజయ్, అజయ్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్నారు. అర్జున ఫాల్గుణ, జోహార్, కోట బొమ్మాళి పీఎస్ వంటి సినిమాలతో దర్శకుడిగా గుర్తింపు తెచ్చుకున్న తేజ మార్ని యక్షిణి సిరీస్ ను రూపొందిస్తున్నారు. రీసెంట్ గా 'యక్షిణి' కమింగ్ సూన్ అంటూ ఈ వెబ్ సిరీస్ ఫస్ట్ లుక్ పోస్టర్ ను రిలీజ్ చేశారు. ఇప్పటి దాకా వచ్చిన సోషియో ఫాంటసీ సినిమాలు, వెబ్ సిరీస్ లకు భిన్నమైన కాన్సెప్ట్ తో 'యక్షిణి'ని రూపొందించారు. ఈ సిరీస్ కు సంబంధించిన మరిన్ని వివరాలు త్వరలో వెల్లడించనున్నారు. తెలుగు తో పాటు తమిళ, కన్నడ, మలయాళ, హిందీలో 'యక్షిణి వెబ్ సిరీస్ స్ట్రీమింగ్ కు రాబోతోంది.

# ఓటిటిలోకి వస్తోన్న 'విద్య వాసుల అహం'




ఇప్పుడు మరో సినిమా ఇదే ఓటిటి ఆహా లో విడుదలకి సిద్ధం అయింది. ఈ సినిమా పేరు 'విద్య వాసుల అహం' ఇందులో కొంచెం మసాలా కూడా వున్నట్టుగా ఈ సినిమా టీజర్ చూస్తే అర్ధం అవుతోంది. అహంతో కూడిన ప్రేమకథ లోని భావోద్వేగాలను, ఇగోలను చూపించడానికి రెడీ అవుతున్నారు విద్య, వాసు. ఈ సినిమా మే 17న ప్రపంచవ్యాప్తంగా ఆహా ఓటీటీ ప్లాట్‌ఫామ్ వేదికగా ప్రీమియర్ కానుంది. ఈ సినిమా కథని కథని టూకీగా చెప్పాలంటే రాహుల్ విజయ్, శివానిలు అసలు పెళ్ళంటే ఇష్టం లేని వాసు, విద్యలుగా ఇందులో కనిపిస్తారు, కానీ ఈ ఇద్దరూ పెళ్లి చేసుకోవలిసి వస్తుంది. పెళ్లయిన తరువాత ఇద్దరూ ఒకరి అభిప్రాయాలకి, ఇంకొకరు గౌరవించాలి, మాట్లాడుకోవాలి, కానీ కాని ఇద్దరూ నేనే నెగ్గాలి అని అనుకుంటే, అదే ఇగోకి పోతే, ఆ పెళ్లి జీవితంలో ప్రేమ బాధ్యతల మధ్యలో ఇగో వస్తే ఎలా ఉంటుంది అనే నేపధ్యలో కథ జరుగుతుంది. అలాంటి సమయంలో వీరిద్దరూ ఇగోతో కలిసే ఉంటారా లేదా పెళ్ళైన కొత్తలో ఉండే మూమెంట్స్ ని ఎంజాయ్ చేస్తారా అనేది తెలియాలంటే ఆహాలో మే 17 వరల్డ్ డిజిటల్ ప్రీమియర్ అయ్యే వరకు వేచి చూడాల్సిందే...ఈ సినిమాకి మహేష్ దత్త మొతూరు, లక్ష్మీ నవ్య మక్కపాటి నిర్మాతలు. మణికాంత్ గెల్లి దర్శకుడు. 'విద్య వాసుల అహం' (ఏ లాంగ్ లాంగ్ ఈగో స్టోరి) అనే టాగ్ లైన్ లో వస్తున్నా ఈ సినిమా ఆహాలో ఈ నెల 17న విడుదలవుతోంది అని చిత్ర యూనిట్ వెల్లడించింది.

# ఇండియా కూటమి విజయం సాధిస్తే..మేలే

## - జూన్ 5ననే జైలు నుంచి బయటకు వస్తా - కేజ్రీవాల్ ఆశాభావం

**న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్):** లోక్‌సభ ఎన్నికల ఫలితాలు వెలువడిన తర్వాత ఇండియా కూటమి అధికారంలోకి వచ్చిన పక్షంలో జూన్ 5న తాను తీహార్ జైలు నుంచి తిరిగి వస్తానని ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ సోమవారం ఆశాభావం వ్యక్తం చేశారు. ఎక్సైజ్ పాలసీ కుంభకోణానికి సంబంధించిన మనీ లాండరింగ్ కేసులో అరెస్టయి ఎన్నికల ప్రచారం కోసం మూడు వారాల మధ్యంతర బెయిల్‌పై విడుదలైన కేజ్రావాల్ జూన్ 2న తిరిగి తీహార్ జైలుకు వెళ్లవలసి ఉంటుంది. ఏడు దశల లోక్‌సభ ఎన్నికల చివరి దశ జూన్ 1న జరగనున్నది. జూన్ 4న ఎన్నికల ఫలితాలు వెలువడనున్నాయి. ఆప్ కౌన్సిలర్లను ఉద్దేశించి కేజ్రీవాల్ సోమవారం ప్రసంగిస్తూ తీహార్ జైలులో జుడిషియల్ కస్టడీలో ఉన్న తనను నైతికంగా దెబ్బతీయడానికి, అవమానించడానికి ప్రయత్నాలు జరిగాయని చెప్పారు. తీహార్ జైలులోని తన సెల్‌లో రెండు సిసిటివి కెమెరాలు ఉన్నాయని, వాటి ద్వారా తన కదలికలను 13 మంది అధికారులు పర్యవేక్షించారని ఆయన తెలిపారు. ప్రధాని నరేంద్ర మోడీకి కూడా సిసిటివి ఫీడ్ వెళ్లేదని, ఆయన కూడా తనను గమనించేవారని కేజ్రీవాల్ ఆరోపించారు. ప్రధాని మోడీ తనపైన ఎందుకు అంత కక్ష పెట్టుకున్నారో తనకు తెలియదని ఆయన చెప్పారు. ఆప్ నాయకులంటే ప్రజలకు గౌరవంతోపాటు అభిమానం ఉందని, మనం చేసే పనులను చూసి బిజెపి నాయకులు భయపడుతున్నారని ఆయన అన్నారు. జూన్ 2న తాను తిరిగి జైలుకు వెళ్లాల్సి ఉంటుందని, జూన్ 4న జైలులో నుంచే ఎన్నికల ఫలితాలను గమనిస్తుంటానని ఆయన చెప్పారు. ఇండియా కూటమి అధికారంలోకి వస్తే జూన్ 5న తాను జైలు నుంచి బయటకు వస్తానని కేజ్రీవాల్ ఆశాభావం వ్యక్తం చేశారు. కాగా..ఆదివారం పార్టీ ఎమ్మెల్యేలతో సమావేశమైన కేజ్రీవాల్ తన అరెస్టు తర్వాత బిజెపి ఎన్నికల ప్రయత్నాలు చేసినప్పటికీ చీలిపోనందుకు వారిని అభినందించారు. తన అరెస్టు తర్వాత చీలిపోకుండా మరింత సంఘటితమైనందుకు ఆప్ ఎమ్మెల్యేలను ఆయన అభినందించారు.



# ప్రశాంతంగా నాలుగో విడత పోలింగ్

## - మధ్యాహ్నం ఒంటి గంట వరకూ 40.32 శాతం నమోదు



**న్యూఢిల్లీ(ప్రశ్న న్యూస్ :** లోక్‌సభ ఎన్నికల నాలుగో విడత పోలింగ్ ప్రశాంతంగా మొదలయ్యింది. 9 రాష్ట్రాలు, ఒక కేంద్రపాలిత ప్రాంతంలోని 96 నియోజకవర్గాల్లో చురుకుగా కొనసాగుతోంది. సోమవారం మధ్యాహ్నం ఒంటి గంట వరకూ 40.32 శాతం పోలింగ్ నమోదైంది. భారత ఎన్నికల కమిషన్ జారీ చేసిన గణాంకాల ప్రకారం, పశ్చిమబెంగాల్‌లో అత్యధికంగా 51.87 శాతం పోలింగ్ నమోదు కాగా, జమ్మూ కశ్మీర్‌లో అత్యల్పంగా 23.57 శాతం నమోదైంది. మధ్యప్రదేశ్‌లో 48.52 శాతం, ఆంధ్రప్రదేశ్‌లో 40.26 శాతం, తెలంగాణలో 40.38 శాతం, బీహార్‌లో 34.43, జార్ఖాండ్‌లో 43.8 శాతం, ఒడిశాలో 39.30 శాతం, మహారాష్ట్రలో 30.85, ఉత్తరప్రదేశ్‌లో 39.68 శాతం పోలింగ్ నమోదైంది. లోక్‌సభ స్థానాలతో పాటు ఆంధ్రప్రదేశ్‌లోని 175 అసెంబ్లీ స్థానాలు, ఒడిశాలోని 28 అసెంబ్లీ స్థానాలకు కూడా ఆదివారంనాడు పోలింగ్ జరుగుతోంది. కాగా, ఆదివారం పోలింగ్ జరుగుతున్న మొత్తం 96 లోక్‌సభ స్థానాల్లో ఆంధ్రప్రదేశ్‌లో 25, తెలంగాణలో 17, ఉత్తరప్రదేశ్‌లో 13, మహారాష్ట్రలో 11, మధ్యప్రదేశ్‌లో 8, పశ్చిమబెంగాల్‌లో 8, బీహార్‌లో 5, జార్ఖాండ్, ఒడిశాలో చెరో ఐదు, జమ్మూకశ్మీర్‌లో ఒక లోక్‌సభ స్థానం ఉన్నాయి.

# మా అమ్మపై నాలుగేళ్లుగా అత్యాచారం

## - ప్రజ్వల్ రేవణ్ణపై మహిళ ఫిర్యాదు



**బెంగళూరు (ప్రశ్న న్యూస్):** లోక్‌సభ ఎన్నికల వేళ హాసన సెక్స్ కుంభకోణం కర్ణాటకలో ప్రకంపనలు సృష్టిస్తోంది. ఈ వ్యవహారంపై సిట్ దర్యాప్తును ముమ్మరం చేసింది. లైంగిక వేధింపులకు సంబంధించి ఫిర్యాదు చేసిన ఓ మహిళ.. హాసన ఎంపీ ప్రజ్వల్ రేవణ్ణకు సంబంధించి షాకింగ్ విషయాలను బయటపెట్టింది.తన తల్లిపై నాలుగైదేళ్ల క్రితం బెంగళూరులోని నివాసంలో ప్రజ్వల్ రేవణ్ణ అత్యాచారానికి పాల్పడినట్లు ఆ మహిళ ఆరోపించింది. దీనికి సంబంధించి సిట్ అధికారుల ఎదుట వాంగ్మూలాన్ని ఇచ్చింది. అంతే కాకుండా ప్రజ్వల్ వీడియో కాల్‌లో బెదిరించి తన దుస్తులు విప్పించాడని తెలిపింది. 'ఆయన మా అమ్మ ఫోన్‌కు కాల్ చేసి.. వీడియో కాల్‌లో మాట్లాడాలని నన్ను బలవంతం చేసేవాడు. నా దుస్తులు విప్పాలని అడిగేవాడు. నేను అందుకు నిరాకరిస్తే.. నాకు, మా అమ్మకు హాని తలపెడతానని బెదిరించేవాడు' అని ఆమె పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొంది. ప్రజ్వల్, హెచ్‌డీ రేవణ్ణ తన తల్లిపై లైంగిక వేధింపులకు పాల్పడ్డారని ఆమె తెలిపింది. తన తండ్రిని ఉద్యోగం నుంచి తొలగిస్తానని బెదిరించి తనపై, తన తల్లిపై అత్యాచారానికి పాల్పడినట్లు ఆరోపించింది. తాము ఈ ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేయగానే.. తన తండ్రిని ఉద్యోగం నుంచి తొలగించారని పేర్కొంది. తన నివాసంలో పనిచేసే మహిళలను ప్రజ్వల్ వేధింపులకు గురిచేశాడని తెలిపింది. ప్రజ్వల్ బాధితుల్లో ఎంతో మంది మహిళలు ఉన్నారని.. కేవలం ముగ్గురు మాత్రమే వారి దారుణాలను బయటపెట్టారని చెప్పింది. ఈ ఘటన అనంతరం తమ భూమిని కూడా బలవంతంగా అమ్ముకోవాల్సి వచ్చిందని ఆ మహిళ ఆవేదన వ్యక్తం చేసింది. ఈ వ్యవహారంలో ఇప్పటి వరకూ ప్రజ్వల్ రేవణ్ణ, ఆయన తండ్రిపై మూడు ఎఫ్ఐఆర్‌లు నమోదయ్యాయి. హెచ్‌డీ రేవణ్ణను అదుపులోకి తీసుకున్న పోలీసులు మే 14 వరకు జ్యుడిషియల్ కస్టడీకి తరలించారు. మరోవైపు ప్రజ్వల్ ఈ ఘటన వెలుగులోకి వచ్చిన మొదట్లోనే

# ఉప్పల్ లో తీవ్ర విషాదం

## - పోలింగ్ బూత్ వద్ద కుప్పకూలిన మహిళ, మృతి




ఉప్పల్ (ప్రశ్న న్యూస్) ఉప్పల్ లో ఓటు వేయడానికి వచ్చిన మహిళా మృతి చెందింది. ఉప్పల్ లో తీవ్ర విషాదం చోటు చేసుకుంది. ఓటు వేయడానికి వచ్చిన మహిళ హార్ట్ ఎటాక్ తో మృతి చెందింది. భరత్ నగర్ కు చెందిన విజయ లక్ష్మి , ఓటు వేయడానికి పోలింగ్ బూత్ కు వచ్చింది. అయితే ఉప్పల్ పోలింగ్ స్టేషన్ లోనే కింద పడిపోయింది. దీంతో ఆమెను స్థానిక హాస్పిటల్ కి తరలించారు పోలింగ్ సిబ్బంది, స్థానికులు. అప్పటికే ఆమె మరణించింది. హార్ట్ ఎటాక్ తో మృతి చెందిందని నిర్ధారించారు డాక్టర్. ఇక ఈ సంఘటనపై కేసు నమోదు చేసుకొని విచారిస్తున్నారు ఉప్పల్ పోలీసులు.

# జగన్‌కు అనుకూలంగా ఫలితాలు

## - బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్

**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్):** పోలింగ్ స్టేషన్ల దగ్గర కరెంటు కోతలు లేకుండా ముగ్గురేసి అధికారులను పెట్టి ప్రభుత్వం చాలా కష్టపడుతోందని మాజీ మంత్రి కేటీఆర్ అన్నారు. జనరేటర్లను కూడా అందుబాటులో ఉంచారన్నారు. ఐదేండ్లకోసారి జరిగే ఈ ఎన్నికల్లో ప్రజలు స్వేచ్ఛగా ఓటు వేయాలని కోరారు. దయచేసి అందరూ బయటికి వచ్చి పోలింగ్ లో పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు. ఇవాళ నంది నగర్ లోని జిహెచ్ఎంసి కమ్యూనిటీ హాల్లో తమ ఓటు హక్కును వినియోగించుకున్న కేటీఆర్ తన కుటుంబ సభ్యులతో కలిసి ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఏపీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి తనకు సోదరుడి లాంటి వారని, ఈ ఎన్నికల్లో ఆయన మంచి ఫలితాలు సాధిస్తారనే నమ్మకం తనకు ఉందని అన్నారు. ఆరు గ్యారంటీలో ప్రస్తుత తెలంగాణ ప్రభుత్వం ఒక గ్యారెంటీని సగం సగం అమలు చేసిందని అన్నారు. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇప్పటికైనా తాను ముఖ్యమంత్రిని గుర్తించాలని అన్నారు. కరెంటు కోతలు, నీటి కొరతల వంటి అసలైన సమస్యల పైన రేవంత్ రెడ్డి దృష్టి పెట్టాలని కోరుకుంటున్నట్టు చెప్పారు. ప్రజలు ఎవరికి ఓటేస్తారో నాలుగో తేదీన తేలుతుందని అన్నారు. పదేండ్ల నుంచి నరేంద్ర మోడీ ప్రజలని మోసం చేస్తుంటే.. వందరోజుల నుంచి ఇక్కడ రేవంత్ రెడ్డి మోసం చేస్తున్నారని అన్నారు. తెలంగాణ కోసం తెలంగాణ భవిష్యత్తు కోసం తాను ఓటేశానని, అందరూ ఓటేయాలని కోరారు.



# రాష్ట్రంలో భారీగా తగ్గిన ఓటింగ్ శాతం

## ఓటు వేయడానికి ఆసక్తి చూపని జనాలు




**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** రాష్ట్రంలో గత డిసెంబర్ నెలలోనే అసెంబ్లీ ఎన్నికలు జరగగా సోమవారం నాడు పార్లమెంట్ ఎన్నికలు జరుగాయి. ఇందులో భాగంగా సోమవారం నాడు ఉదయం 6 గంటల నుండి రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలలో ఓటింగ్ ప్రక్రియ ప్రారంభం అయింది. అయితే రాష్ట్రంలో ఉదయం 10 దాటితే ఎండలు భారీగా ఉంటున్న నేపథ్యంలో ఓటర్లు అంతా కూడా తమ ఓటు హక్కును ఉదయం 10 గంటల్లోపే వేయడానికి ప్రాధాన్యతను ఇచ్చారు. దానితో రాష్ట్రంలో ఉదయం 10 గంటలలోపే భారీ మొత్తంలో ఓటింగ్ శాతం నమోదు అయ్యింది.ఆ తర్వాత కాస్త మందకోడిగా ఓటింగ్ సాగింది.ఇదిలా ఉండగా పోయిన సంవత్సరం డిసెంబర్ లో జరిగిన అసెంబ్లీ ఎన్నికలలో 71.31 శాతం ఓటింగ్ జరిగింది. ఇలా అసెంబ్లీ ఎన్నికల్లో భారీ ఓటింగ్ శాతం నమోదు కావడంతో ఆ తర్వాత చాలా దగ్గరలో వచ్చిన ఎన్నికల కావడంతో ఆదే స్థాయిలో ఓటింగ్ శాతం నమోదు అవుతుంది అని అనేకమంది భావించారు. కానీ అసెంబ్లీ ఎన్నికల్లో జరిగినంత స్థాయిలో పార్లమెంట్ ఎన్నికల్లో ఓటింగ్ శాతం నమోదు కాలేదు. ఇకపోతే 5 గంటల వరకు ఉన్న రిపోర్టు ప్రకారం తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా 61.16 శాతం పోలింగ్ నమోదు అయ్యింది. మరి జిల్లాల వారీగా చూస్తే ఆదిలాబాద్ లో 69.81, భువనగిరిలో 62.34, చేవెళ్లలో53.15, హైదరాబాద్‌లో 39.17, కరీంనగర్లో 67.67, ఖమ్మంలో70.76, మహబూబాబాద్లో 68.60, మహబూబ్‌నగర్ లో 68.40, మల్కాజిగిరిలో 46.27, మెదక్లో 71.33, నాగర్ కర్నూల్ లో 66.53, నల్గొండ లో 70.36, నిజామాబాద్లో 67.96, పెద్దపల్లిలో 63.86, సికింద్రాబాద్‌లో -42.48 శాతం, వరంగల్లో64.08, జహీరాబాద్లో71.91, సికింద్రాబాద్లో కంటోన్మెంట్ లో 47.88 శాతం గా పోలింగ్ నమోదైంది. ఇక పోలింగ్ కి ఒక గంట సమయం మిగిలి ఉన్నప్పటికీ నక్సల్స్ ప్రభావిత అసెంబ్లీ నియోజకవర్గాలు అయిన ఆసిఫాబాద్, సిర్పూర్, చెన్నూరు, బెల్లంపల్లి, మంచిర్యాల, మంథని, భూపాలపల్లి, ములుగు, భద్రాచలం, పీనపాక, ఇల్లందు, అశ్వరావుపేట, కొత్తగూడెం అసెంబ్లీలో నాలుగు గంటలకే ఓటింగ్ ముగిసింది.

# ఆంధ్రప్రదేశ్లో పలు ప్రాంతాల్లో ఉద్రిక్తతలు

**అమరావతి (ప్రశ్న న్యూస్):** అనుకున్నట్టుగానే ఆంధ్రప్రదేశ్లో పలు ప్రాంతాల్లో ఉద్రిక్తతలు నెలకొన్నాయి. పోలింగ్ సందర్భంగా వైసీపీ, టీడీపీ శ్రేణులు కొట్టుకున్నారు. ముఖ్యంగా పల్నాడు జిల్లాలో పలు ప్రాంతాల్లో ఘర్షణలు జరుగుతున్నాయి. దాచేపల్లిలోని కేసనపల్లి గ్రామంలో పోలింగ్ బూత్ వద్ద తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. ఓటర్లను పోలింగ్ బూత్కు తీసుకు వెళ్లే విషయంలో వైసిపి టిడిపి వర్గీయుల మధ్య ఘర్షణ తలెత్తింది. ఈ గొడవలో టిడిపి, వైసీపీ నేతలు గాయపడ్డారు. రెంటచింతలలో టీడీపీ, వైసీఎంపీ నియోజకవర్గంలో 85.16 శాతం ఓటింగ్ నమోదైతే.. 2019లో అది 85.49 శాతానికి పెరిగింది. ఒంగోలు పార్లమెంటు పరిధిలో 2014లో 82.23 శాతం మంది ఓటు హక్కు వినియోగించుకుంటే.. 2019లో మరో మూడు శాతం అదనంగా.. 85.23 శాతం మంది పోలింగ్‌లో పార్టిసిపేట్ చేశారు. నర్సరావుపే పార్లమెంటు నియోజకవర్గాలు. ఎందుకంటే 2019 జనరల్ ఎలక్షన్స్‌లో అత్యధిక శాతం ఓటింగ్ జరిగిన టాప్-10 నియోజకవర్గాల్లో చోటు దక్కించుకున్నాయి ఈ మూడు సెగ్మెంట్లు. తమ రికార్డుల్ని తామే బద్దలు కొట్టి.. కింగ్ సైజులో నిలబడ్డ హాట్ ఫేవరిట్ నియోజకవర్గాలివి. 2014లో బాపట్ల ప్రదేశ్. టాప్ ప్లేస్‌లో ఉన్న వెస్ట్ బెంగాల్‌లో 81.8 శాతం ఓటింగ్ నమోదైంది. 2014లో నమోదైన 74.64 శాతం కంటే మరింత మెరుగుపడి 2019లో ఎయిటీ మార్క్‌ను క్రాస్ చేసింది ఏపీ. ఇదిలా ఉంటే.. బాపట్ల, ఒంగోలు, నర్సరావుపేట.. ఏపీని దేశవ్యాప్తంగా తలెత్తుకునేలా చేసిన మూడు2009లో 72.70 శాతం, 2014లో 74.64 శాతం, 2019లో 80.39 శాతం.. ఇలా ప్రతీ ఎన్నికల్లోనూ టోటల్ టర్నవుట్‌లో ఇంక్రిమెంట్ ఇస్తూ వస్తున్నాడు ఏపీ ఓటరు. 2019 సార్వత్రిక ఎన్నికల్లో 80.4 శాతం ఓట్లతో దేశంలోని మిగతా రాష్ట్రాల కంటే బాగా పెర్ఫామ్ చేసి రెండో స్థానంలో నిలిచింది ఆంధ్రా రావడం ఇక్కడ గమనించాల్సిన విషయం. గత పదిహేనేళ్లుగా ఓటింగ్ శాతం లెక్కల్లో బెటర్‌గా పెర్ఫామ్ చేస్తూ వస్తోంది ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం. నేషనల్ రికార్డుల్ని సైతం బద్దలు కొడుతోంది. ఈసారి కూడా అదే ఊపు కంటిన్యూ ఐందా? ఏపీ ఓటరు మాత్రమే ఎందుకంత స్పెషల్..?



Printed, Published & Owned by "Gouti Bala Sai Tilak" and Published at H.No : 8-2-293/82/10/80, Womens Co-operative Housing Society, Road No - 7, Jubilee Hills, Hyderabad - 500033, Telangana State. Printed at "Gowrish Offset Printers". H.No : 3-4-353, Barkatpura, Hyderabad-500027. Telangana State. Editor : "Vempati Vijay Kumar". "RNI No: TELTEL/2021/80267". Email : prajaprashna@gmail.com. Cell No : 9494055588